జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏజెంట్/కార్యనిర్వహణ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

94402 31967

రంగారెడ్డి | శనివారం 7 నవంబర్ 2026 | సంపుటి : 17 | సంచిక : 126 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం, ఋతువు: శరద్ ఋతువు, అయనం: దక్షిణాయణం, విశేషం: మాస శివరాత్రిసూర్యోదయం: 6.02 , సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 4.57 చంద్రాస్తమయం: 4.06 తిథి: బహుళ తదియ ఉ. 10.22 వరకు, తదుపరి చవితి నక్షత్రం: విశాఖ ఉ. 6.00 వరకు, తదుపరి స్వాతి యోగం: ప్రీతి తె. 4.32 వరకు, తదుపరి ఆయుష్మాన్ కరణం: వణిజ ఉ. 10.22 వరకు, తదుపరి భద్ర రా. 10.24 వరకు, తదుపరి శకుని

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com



మూసీ కోసం ‘గ్లోబల్’ పోటీ!

హైదరాబాద్: భాగ్యనగర రూపురేఖ లను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్ట్ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నిబంధనల ప్రకారం సుమారు రూ.7,345.12 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న తొలి దశ పనులకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) ఆహ్వానించిన అంతర్జాతీయ టెండర్లకు అనూహ్య స్పందన లభించింది. ఇటీవల జరిగిన ప్రీ--బిడ్ సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా 15 సంస్థలు, ఆఫ్‌లైన్ ద్వారా మరో 15 సంస్థలు పాల్గొని ప్రాజెక్టు వివరాలపై ఆరా తీశాయి. భారత్‌కు చెందిన దిగ్గజ మౌలిక సదుపాయాల సంస్థలు ఎల్‌అండ్‌టీ, ఏఎంఆర్ గ్రూప్, మెఘా వంటి సంస్థలతో పాటు చైనా, హాంకాంగ్, ఇండోనేషియా, దక్షిణ కొరియా, మలేషియా సహా మొత్తం 48 దేశాలకు చెందిన అంతర్జాతీయ ఏజెన్సీలు, నిర్మాణ రంగ దిగ్గజాలు ఈ టెండర్లపై ఆసక్తి కనబరిచాయి. ఏడీబీ సభ్య దేశాలకు చెందిన అర్హతగల సంస్థలన్నింటికీ పోటీ పడే అవకాశం ఉండడంతో మూసీ పనుల కోసం గ్లోబల్ స్థాయి పోటీ నెలకొంది. బిడ్ల దాఖలుకు ఈనెల 26 తుది గడువు కావడంతో అంతర్జాతీయ దిగ్గజాల పోటీలో మూసీ ప్రాజెక్ట్ ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

రెండు ప్యాకేజీలుగా విభజన..

భూసేకరణ వ్యయాన్ని మినహాయించి రూ.7,345.12 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ.4,500 కోట్లు ఏడీబీ రుణంగా సమకూరనుండగా, మిగిలిన రూ.2,845.12 కోట్లను హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ ద్వారా సమీకరించనున్నారు. మొత్తం 19.05 కిలోమీటర్ల తొలి దశ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. జోన్--1బీ పరిధిలో నార్సింగి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై అత్యాధునిక ఐకానిక్ కేబుల్ స్టేడ్ స్టీల్ బ్రిడ్జి, జోన్--1ఏలో రాజేంద్రనగర్ టోల్ ప్లాజా సమీపంలో మరో ఐకానిక్ వంతెన నిర్మించనున్నారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో సమగ్ర నదీ ప్రక్షాళన, వరద నివారణ కట్టలు, రిటైనింగ్ వాల్స్, నదీ తీర రహదారులు, మురుగునీరు నది లో కలవకుండా భారీ ట్రంక్ సీవర్ మెయి న్స్, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ కారిడార్, రబ్బర్ డ్యామ్‌ల నిర్మాణం చేపడతారు.

‘మార్కుల’పద్ధతిలో కాంట్రాక్టర్ల ఎంపిక..

పాత విధానంలో కేవలం తక్కువ ధర (ఎల్1) కోట్ చేసిన సంస్థకే పనులు అప్పగించే పద్ధతికి స్వస్తి పలికారు. ఏడీబీ మార్గదర్శకాల ప్రకారం మెరిట్ పాయింట్ క్రైటీరియా (ఎంపీసీ) అమలు చేస్తున్నారు. ఇందులో సంస్థల సాంకేతిక సామర్థ్యం, పనితీరు నాణ్యతకు 50 శాతం, ఆర్థిక బిడ్‌కు 50 శాతం వెయిటేజీ ఇచ్చి, ఉమ్మడి మార్కులు ఎక్కువగా సాధించిన సంస్థకే కాంట్రాక్టు అప్పగిస్తారు. ఎంపికైన సంస్థలు 24 నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, తదుపరి 5 ఏళ్ల పాటు నిర్వహణ (ఓఅండ్‌ఎం) బాధ్యతలు చూసుకోవాల్సి ఉంటుంది.

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం

షాద్‌నగర్ బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ వై రవీందర్ యాదవ్ హెచ్చరిక

60గ్రామాల ప్రజల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దు..

రోజుకు సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల చెత్తను పచ్చని పల్లెలపై పోసేందుకు ప్రణాళిక

క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన ప్రాజెక్టును మాపై రుద్దొద్దు

తక్షణమే జీవో 641ను రద్దు చేయాలి..



సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు, అదనపు ఆదాయం

రైతులకు శాస్త్రీయ అవగాహన..

తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ, క్షేత్ర పర్యటన



షాబాద్ నవంబర్ 6 (ప్రజాజ్యోతి) సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా 40 మంది ప్రగతిశీల రైతులకు శిక్షణ, క్షేత్ర పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని షాబాద్, చేవెళ్ల మండలాలకు చెందిన రైతులు మెదక్ జిల్లాలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల

ఆకాశమంత అక్రమ నిర్మాణాలు

“రమణ” రహస్య వసూళ్లు.. నాక్ ఇంజనీర్ల నాటకీయత

కూకట్‌పల్లి కలెక్షన్ కింగ్స్

రెండు సర్కిళ్లలో ఒకే అధికారి హవా?

అక్రమ నిర్మాణాలే అడ్డగోలు సంపాదనకు అడ్డా?



కూకట్ పల్లి నవంబర్ 5(ప్రజా జ్యోతి):- కూకట్‌పల్లి,మూసాపేట్ సర్కిల్ లలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతోంది. నిబంధనలకు తిలోదకాలిస్తూ ఆకాశాన్నంటే భవనాలు వెలుస్తున్నా, వాటిని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వర్షాభావంతో రాంపూర్ లో ఎండిపోయిన వరి,మొక్కజొన్న,వేరుశెనగ పంటలు

పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన వ్యవసాయ అధికారి ఏఈఓ అనిత

పంట నష్టంపై సమగ్ర నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడి



తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): తలకొండపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం కారణంగా ఎండిపోయిన పంట పొలాలను తలకొండపల్లి మండల వ్యవసాయ అధికారి ఏఈఓ అనిత,రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొక్కజొన్న,వరి,వేరుశెనగ తదితర పంటలు ఎండిపోయిన పొలాలను పరిశీలించి,రైతులతో మాట్లాడి నష్ట వివరాలను సేకరించారు.చేతికొచ్చే సమయంలో వర్షాలు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయని,రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకుండా పోయిందని రైతులు అధికారులకు వాపోయారు.ముఖ్యంగా వరి పంట గింజ పట్టే దశలో,మొక్కజొన్న కంకి వేసే దశలో నీరు అందక ఎండిపోయాయని తెలిపారు. వేరుశెనగ పంట కూడా కాయలు లేక ఎండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.బోర్లు,బావుల్లో నీరు తగ్గిపోవడంతో పంటలను కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ సందర్భంగా ఏఈఓ అనిత మాట్లాడుతూ..మండలంలోని రాంపూర్ మరియు వివిధ గ్రామాల్లో ఎండిపోయిన పంటల వివరాలను సేకరించి,పంట నష్టంపై సమగ్ర నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలిస్తామని వెల్లడించారు.ప్రతి గ్రామంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో ఎండిపోయింది,ఎంత శాతం నష్టం జరిగింది అనే వివరాలను క్షేత్రస్థాయిలోనే నమోదు చేస్తున్నామన్నారు.నివేదిక ఆధారంగా ప్రభుత్వం నష్టపరిహారం అందించే అవకాశం ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు.రైతులు తమ పంట పొలాల వద్ద ఉండి పంట నష్ట వివరాలను అధికారులకు తెలియజేసి సహకరించాలని కోరారు.గ్రామాల్లో సర్పంచులు దండోరా వేయించి వ్యవసాయ అధికారులకు సహకరించాలని సూచించారు.పంట బీమా చేసుకున్న రైతులు తమ వివరాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలో చేతికొచ్చిన వరి,మొక్కజొన్న, వేరుశెనగ పంటలు ఎండిపోవడం జరిగిందని,రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.రైతులు కూడా అధికారులను నష్టపరిహారం చెల్లించాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,ఏఈఓ అనిత,హనుమాన్ టెంపుల్ చైర్మన్ మధు వెంకట రెడ్డి,సప్పిడి శివ,మాజీ వార్డు సభ్యులు చిల్కం పకీర,నిమ్మల జంగయ్య,రొయ్యల కృష్ణయ్య,మీసాల జంగయ్య,చిల్కం వెంకటేష్,కె. రమేష్,పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పండుగల వేళ మిఠాయిలతో దంతాల ఆరోగ్యంపై జాగ్రత్త



హైదరాబాద్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) : పండుగల సమయంలో మిఠాయిలను తరచుగా తీసుకోవడం వల్ల దంతాల ఎనామెల్ దెబ్బతిని, పుచ్చులు ఏర్పడే ప్రమాదం ఉందని ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ సోనియా దత్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీపి పదార్థాలను మితంగా తీసుకోవాలని, భోజనంతో పాటు తీసుకోవడం, నీటితో నోరు పుక్కిలించడం, పడుకునే ముందు బ్రష్ చేయడం వంటి అలవాట్లు పాటించాలని సూచించారు. రోజువారీ నోటి సంరక్షణకు తోడ్పడేలా తోమర్ బీజ్(జాంతోక్స్ తైలమ్ అలటమ్), పుదీనా సత్వ కలిగిన డాబర్ రెడ్ పేస్ట్‌ను ప్రస్తావించారు. దీనికి ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడిఏ) ఆమోదం ఉందని పేర్కొన్నారు. పండుగల ఆనందంతో పాటు నోటి ఆరోగ్యానికీ ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్



తలకొండపల్లి/కడ్తాల్,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా నాయకులు,కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని అన్నారు.కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హెల్ప్ డెస్క్ ను శుక్రవారం ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్,డిసిసి ప్రధాన కార్యదర్శి చేగురి వెంకటేష్,యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ లతో కలిసి ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.హెల్ప్ డెస్క్ ద్వారా పట్టభద్రులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందని,అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటు హక్కు నమోదు ప్రక్రియపై గ్రామాలు,తండాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కోరారు.పట్టభద్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సౌలభ్యం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అర్హులైన పట్టభద్రులకు ఓటు నమోదు నుంచి అవసరమైన సహకారం అందించి, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాల కుర్ల అద్దాల రాములు,మాలే మల్లేష్ గౌడ్,లక్ష్మయ్య,షాబుద్దీన్,సత్యం తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్ విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత

సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వెల్జాల్ లో సేవా కార్యక్రమాలు

ప్రైమరీ స్కూల్ కు ఫ్యాన్లు,విద్యార్థులకు పెన్నుల పంపిణీ



తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముందస్తుగా జన్మదినం సందర్భంగా వెల్జాల్ కాంగ్రెస్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు.ఆదివారం 8వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం వెల్జాల్ ఎంపీపీఎస్ ప్రైమరీ స్కూల్ లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రధానోపాధ్యాయురాలు లావణ్య ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్యాన్లు అందజేశారు.విద్యార్థినీ విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేయడంతో పాటు,గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులకు పెన్నులు అందజేశారు.చిన్నారులు పెన్నులు అందుకుని సంతోషం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులు కూడా నాయకుల ఈ చొరవను అభినందించారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే మంచి సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు.విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ,వారి చదువుకు చిన్నపాటి సహాయం అందించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. పాఠశాలలో వేసవి కాలంలో విద్యార్థులు ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలియడంతో,ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఫ్యాన్లు అందించడం ఎంతో సముచితంగా భావించామని నాయకులు తెలిపారు.విద్య అనేది ప్రతి బిడ్డ హక్కు అని,ఆ విద్యకు అవసరమైన వసతులు కల్పించడం సమాజం బాధ్యత అని అన్నారు.సేవా కార్యక్రమాలే నిజమైన జన్మదిన వేడుకలకు నిదర్శనమని తెలిపారు.కేక్ లు కట్ చేసి,ప్లెక్సీలు కట్టడం కంటే పేద విద్యార్థులకు సహాయం చేయడమే ముఖ్యమంత్రికి ఇచ్చే నిజమైన బహుమతి అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విద్యకు,సేవకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని,ఆ స్ఫూర్తితోనే తాము ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందస్తుగా వెల్జాల్ కాంగ్రెస్ కమిటీ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేస్తున్నామన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో,మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి,మాజీ ఎంపీటీసీలు జి.శ్రీనివాసమూర్తి,ఎం.అంబాజీ,మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ.అంజయ్య గౌడ్,మాజీ ఉపసర్పంచులు బి.నర్సింలు, అజీజ్, నాయకులు అశోక్ బాబు,టి.కృష్ణయ్య గౌడ్,ఎం.డి.ఆరిఫ్,వద్దే రాజు,పులిజాల విష్ణు,బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డికి అభినందనల వెల్లువ

నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): అమనగల్లు సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గూడూరు శ్రీనివాస్ రెడ్డిని నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.రైతుల సంక్షేమం కోసం,సింగిల్ విండో అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.గూడూరు శ్రీనివాస్ రెడ్డి గతంలో కూడా పలు సేవా కార్యక్రమాల్లో ముందుండి రైతులకు,ప్రజలకు అండగా నిలిచారని నాయకులు గుర్తు చేశారు.ఆయన నాయకత్వంలో సింగిల్ విండో మరింత బలోపేతం అవుతుందని,రైతులకు ఎరువులు,విత్తనాలు,రుణాలు సకాలంలో అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పెద్దలకు,పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారానికి,సింగిల్ విండో ద్వారా అందుతున్న సేవలను మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దేవునిపడకల్ మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం,పద్మ సత్యం,అంబటి బిక్షపతి,రాజమోని నాగరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో పీఏసీఎస్ పదవుల్లో బీసీలకు అన్యాయం

ఎన్నికలు లేకుండా పదవులు పంచడంపై బీజేపీ నేత రవి గౌడ్ ఆగ్రహం

బీసీ,ఎస్టీలకు న్యాయం జరగాలంటే బీజేపీయే దిక్కని పిలుపు



తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ తిరుమణి రవి గౌడ్ తలకొండపల్లి పీఏసీఎస్ నియామక ఉత్తర్వులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరుపై శుక్రవారం తీవ్ర విమర్శలు గుప్పించారు.ఇటీవల ప్రకటించిన పీఏసీఎస్ చైర్మన్ పదవుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని ఆయన మండిపడ్డారు.ఇవి ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాల్సిన చైర్మన్ పదవులని,కానీ ఎన్నికలు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు ఇష్టం వచ్చినట్లు పదవులను కట్టబెడుతున్నారని ఆరోపించారు.ఇది న్యాయమా అని ప్రశ్నించారు.కల్వకుర్తి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు.ఎస్టీలకు ఒక్క స్థానమైనా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.జనాభాలో సగానికి పైన ఉన్న బీసీలకు కేవలం ఒక్క చైర్మన్ పదవి కేటాయించడం చాలా దురదృష్టకరమన్నారు.అదే సమయంలో అగ్రవర్ణాల వారికి మూడు చైర్మన్ పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.పీఏసీఎస్ లు రైతులకు నేరుగా సంబంధించిన సంస్థలని,రైతులకు రుణాలు,ఎరువులు, విత్తనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.అలాంటి కీలకమైన పదవులను ప్రజల అభిప్రాయం లేకుండా,ఎన్నికలు లేకుండా భర్తీ చేయడం రైతులను మోసం చేయడమేనని అన్నారు.గ్రామాల్లో రైతులకు సేవ చేయాల్సిన వ్యక్తులను ప్రజలే ఎన్నుకోవాలని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ అనుచరులకు పదవులు పంచుతోందని విమర్శించారు.ఓట్ చోర్ అంటూ బీజేపీపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.ఓట్లు లేకుండా పదవులను కట్టబెట్టడమే నిజమైన ఓట్ చోరీ అని ధ్వజమెత్తారు.ఈ దొంగ కాంగ్రెస్ ఓట్లు లేకుండానే తమకు ఇష్టం వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు.బీసీలకు మేం 42% రిజర్వేషన్ ఇస్తామని గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్,ఇప్పుడు నామినేటెడ్ పదవుల్లో కూడా మొండి చేయి చూపిందని విమర్శించారు. మాటల్లో బీసీ ప్రేమ,చేతల్లో బీసీలకు అన్యాయం చేయడం కాంగ్రెస్ నైజమని అన్నారు.బీసీలకు ఇంత అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.56 ఏళ్లు పరిపాలన చేసి దేశాన్ని అధోగతి పాలు చేసింది కాంగ్రెస్సే అని గుర్తు చేశారు.ఇప్పుడు రాష్ట్రంలో కూడా అదే తీరు కొనసాగిస్తోందని అన్నారు.బీజేపీపై విమర్శలు చేసే ముందు ఓట్ చోర్ ఎవరు చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.ప్రజలు ఇప్పటికైనా కళ్లు తెరిచి వాస్తవాలు గ్రహించాలని కోరారు.బీసీలకు న్యాయం జరగాలంటే, ప్రజాస్వామ్యం నిలబడాలంటే బీజేపీని ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.బీజేపీ అధికారంలోకి వస్తేనే బీసీ,ఎస్సీ,ఎస్టీలకు నిజమైన న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

నేడు జిల్లా స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు

కడ్తాల్ జోన్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహణ.. ---సహకారం అందిస్తున్న ట్రస్మా ఆమనగల్లు

ప్రజాజ్యోతి, ఆమనగల్, నవంబర్ 6::: పాఠశాల స్థాయి క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయి పోటీలకు ఎంపిక చేయాలనే లక్ష్యంతో ఆమనగల్లు పట్టణంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్‌తో పాటు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8:30 గంటలకు ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభం కానున్నాయి. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్-14 బాలురు, బాలికల వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. కడ్తాల్ జోన్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ఈ క్రీడా పోటీలకు ట్రాస్మా ఆమనగల్లు సహకారం అందిస్తోంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా స్థాయి జట్టు ఎంపికలో అవకాశం కల్పించనున్నారు. క్రీడాకారులు నిర్దిష్ట సమయానికి తమ వివరాలతో పోటీలకు హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు బాలబాలికలను ప్రోత్సహించి పోటీల్లో పాల్గొనేలా చూడాలని కోరారు.

బ్యాంకు సురేష్ సేవలు మరువలేనివి

మాజీ ఎంపీటీసీ మాదారం అనురాధ కృష్ణ గౌడ్

బ్యాంక్ సురేష్ కు శాలువాతో సన్మానించిన అనురాధ కృష్ణ గౌడ్





కొత్తూరు నవంబర్ 06 (ప్రజా జ్యోతి) బ్యాంకు సురేష్ సార్ సేవలు మరువలేనివి మాజీ ఎంపీటీసీ మాదారం అనురాధ కృష్ణ గౌడ్ అన్నారు.కొత్తూరు లో అందరికీ సూపరిచితుడైన బ్యాంకు సురేష్ (సౌత్ ఇండియన్ బ్యాంక్) ఇటీవల పదవి విరమణ పొందాడు. శుక్రవారం మాజీ ఎంపీటీసీ మాదారం అనురాధ కృష్ణ గౌడ్ నివాసంలో బ్యాంకు సురేష్ కు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి అనురాధ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. బ్యాంక్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు కొనియాడారు.

ఒకే గ్రామపంచాయతీలో రెండు సేవాలాల్ ఆలయాల నిర్మాణం

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేగంగా కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు

తండా ప్రజల నుండి ఉప్పల వెంకటేష్ కు అభినందనల వెల్లువ





తలకొండపల్లి, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): తలకొండపల్లి మండలంలోని హర్యానాయాక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల వెంకటేష్ సహకారంతో రెండు తండాల్లో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. హర్యానాయాక్ తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణంలో స్లాబ్,బ్రిక్ వర్క్ పనులు పూర్తయ్యాయి.ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది.త్వరలోనే విగ్రహ ప్రతిష్ట,ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. హఅలాగే సూర్య నాయక్ తండాలో ఆలయ నిర్మాణంలో కాలమ్స్ ఏర్పాటు పూర్తిచేసి,స్లాబ్ నిర్మాణానికి పనులు తుది దశకు చేరుకున్నాయి.మరికొన్ని రోజుల్లోనే స్లాబ్ పనులు పూర్తి చేసి,తదుపరి నిర్మాణ పనులను వేగవంతం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఒకే గ్రామపంచాయతీలో రెండు తండాల్లో ఒకేసారి సేవాలాల్ మహారాజ్ ఆలయాలు నిర్మాణం కావడం ఈ ప్రాంతంలోనే అరుదైన విషయంగా గ్రామస్తులు చెబుతున్నారు.బంజారా సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన సేవాలాల్ మహారాజ్ ఆలయాలు తండాల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు,యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతాయని పెద్దలు అంటున్నారు. సేవాలాల్ మహారాజ్ అంటే బంజారాలకు కేవలం దేవుడు మాత్రమే కాదు,వారి జీవన విధానానికి,ఐక్యతకు,ఆత్మగౌరవానికి ప్రతీకని,ఆయన బోధనలు నేటికీ తండాల్లో ప్రతి ఇంట్లో ప్రతిధ్వనిస్తున్నాయని తెలిపారు.అలాంటి మహనీయుడికి రెండు తండాల్లో ఆలయాలు నిర్మించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు అంటున్నారు.ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ గత కొంతకాలంగా తండాల అభివృద్ధి,ఆధ్యాత్మిక కార్యక్రమాలు,సేవా కార్యక్రమాల్లో ముందుంటోందని గుర్తు చేశారు.ఆలయ నిర్మాణంతో పాటు పేద విద్యార్థులకు సహాయం,ఆరోగ్య శిబిరాలు,సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని పేర్కొన్నారు.ఒకే గ్రామపంచాయతీలో రెండు తండాల్లో సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి సహకరిస్తూ,భక్తి భావాన్ని,ఆధ్యాత్మిక అభివృద్ధిని పెంపొందిస్తున్న ఉప్పల వెంకటేష్ కు, వారి సతీమణికి హర్యానాయాక్ తండా మరియు సూర్య నాయక్ తండా ప్రజల తరపున హృదయపూర్వక అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేశారు.ఆలయ నిర్మాణ పనులను తండా పెద్దలు,యువకులు,మహిళలు స్వయంగా పర్యవేక్షిస్తూ,శ్రమదానంతో కూడా సహకరిస్తున్నారు.రెండు ఆలయాలు పూర్తయితే తండాలకు ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా మారతాయని, భవిష్యత్తులో సేవాలాల్ జయంతి ఉత్సవాలు మరింత ఘనంగా జరుపుకుంటామని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల హక్కుల సాధనే టిడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

సంఘం బలోపేతం, జర్నలిస్టుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయా

ప్రభుత్వ వివక్షపై సమరానికి సిద్ధం కావాలి

టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య





కుత్బుల్లాపూర్, నవంబర్ 6 (ప్రజా జ్యోతి) రాష్ట్రంలోని జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం బాబు జగ్జీవన్‌రామ్-అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాలుగో మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడి సోమయ్య మాట్లాడుతూ.. టిడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధ సంఘం కాదని, ఏ ఒక్క పత్రికకు అనుకూలంగా పనిచేయదని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన ఈ సంఘం ఎప్పుడూ పాలకుల పక్షాన కాకుండా జర్నలిస్టుల పక్షాన నిలబడి సమస్యలపై పోరాడుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు తదితర సంక్షేమ పథకాలను సాధించుకునే వరకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గతంలో సంఘంలో కీలక పదవులు నిర్వహించిన కొందరు వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంఘం ప్రతిష్ఠకు భంగం కలిగించారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంఘాన్ని పునరుద్ధరించి జర్నలిస్టుల విశ్వాసాన్ని చూరగొనేలా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీద అశోక్ అధ్యక్షతన, ప్రముఖుల సమక్షంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ వివరాలు:

అధ్యక్షుడు: అంగూరు గోవిందరావు

వర్కింగ్ ప్రెసిడెంట్: శివ

ఉపాధ్యక్షులు: దప్పు రామస్వామి, మంజుల రెడ్డి, దివాకర్, వెంకట నరసయ్య

ప్రధాన కార్యదర్శి: బ్రహ్మచారి

కోశాధికారి: కొండా సంజీవ కుమార్

సంయుక్త కార్యదర్శి: శ్రీశైలం

ప్రచార కార్యదర్శి: మధు

కార్యవర్గ సభ్యులు: లక్ష్మి, సుస్మిత, సాయిరాజ్, ఆనంద్, కుమార్ గౌడ్, శ్యాం ముదిరాజ్

ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి: ప్రవీణ్ రాజ్

ఇతర బాధ్యతల్లో రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా తేజోమూర్తి, జిల్లా ప్రచార కార్యదర్శిగా వీరేష్ ముదిరాజ్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా శ్యామల వెంకటేష్ నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు కొంచెం శ్రీనివాస్, జగదీష్ గుప్తా, మేడ్చల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కావాలి మోహన్, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు వాసాల బాలరాజు , జిల్లా ఈసీ నెంబర్ యానాల లింగారెడ్డి,కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు యాకయ్య, సీనియర్ జర్నలిస్టులు శివ పార్వతి, స్వప్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం

షాద్‌నగర్ బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ వై రవీందర్ యాదవ్ హెచ్చరిక

60గ్రామాల ప్రజల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దు..

రోజుకు సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల చెత్తను పచ్చని పల్లెలపై పోసేందుకు ప్రణాళిక

క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన ప్రాజెక్టును మాపై రుద్దొద్దు

తక్షణమే జీవో 641ను రద్దు చేయాలి..

పార్టీలకతీతంగా ఐక్య పోరాటానికి జేఏసీ పిలుపు

తక్షణమే జీవో 641ను రద్దు చేసి ప్రజల ఆందోళనకు ముగింపు పలకాలని డిమాండ్

ఉద్యమానికి బిఆర్ఎస్ అధినేత కేటీఆర్ మద్దతు





కొత్తూరు నవంబర్ 06 (ప్రజా జ్యోతి) సిద్ధాపూర్ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్న డంపింగ్ యార్డ్‌ను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని షాద్‌నగర్ బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు అమలైతే చుట్టుపక్కల సుమారు 50 నుంచి 60 గ్రామాల ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొత్తపేట, కోనాయపల్లి తదితర గ్రామాల ప్రజలు, నాయకులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, అదే పరిస్థితిని సిద్ధాపూర్ పరిసర గ్రామాలకు తీసుకురావద్దని ప్రభుత్వాన్ని కోరారు. రోజుకు సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల చెత్తను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించడం ఆందోళనకరమన్నారు. పచ్చని పంట పొలాలు, నివాస ప్రాంతాలు, దర్గా వంటి పవిత్ర స్థలాలకు సమీపంలో రూ.800 కోట్లకు పైగా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు, గాలి కలుషితమై ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, వ్యవసాయం దెబ్బతినడంతో పాటు భూముల విలువలు కూడా పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, ఇది ప్రాంత ప్రజల జీవన్మరణ సమస్య అని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా జేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆందోళనను పట్టించుకోకుండా ముందుకెళ్తే రాబోయే రోజుల్లో హైదరాబాద్ -- బెంగళూరు జాతీయ రహదారిని, షాద్‌నగర్ చౌరస్తాలను దిగ్బంధించడంతో పాటు సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే జీవో 641ను రద్దు చేసి ప్రజల ఆందోళనకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలు విస్తృతంగా చర్చించి ఉద్యమంలో భాగస్వాములు కావాలని, ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా సహకరించాలని కోరారు. ఉద్యమానికి బిఆర్ఎస్ అధినేత కేటీఆర్ మద్దతు సంపూర్ణంగా ఉందని అవసరమైన సమయంలో ఆయన రంగ ప్రవేశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఈ పోరాటాలకు తలొగ్గక పోతే ప్రత్యక్ష కార్యాచరణ కోసం మరో విధంగా రంగంలోకి దిగుతామని అప్పుడు ఉద్యమాన్ని ఎవరు ఆపలేరు అని హెచ్చరించారు. మీడియా సహకారం మరువలేనిది ఎప్రపంచంలో ఏ ఉద్యమం జరిగినా అది ప్రజలకు తెలియాలంటే మీడియా ముఖ్య భూమిక పోషిస్తుందని వై రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో మీడియా ధనవంతు పాత్ర పోషించి సహకరించడం సంఘీభావం తెలపడం ఎంతో గొప్ప విషయం అని దీనిని తాను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని రవీందర్ యాదవ్ అన్నారు. మీడియా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని న్యాయ సమ్మతమైన డిమాండ్కు మీడియా కూడా సహకరించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు జర్నలిస్టు ఏపీ భవాని వేణుగోపాల్ శరత్ కుమార్ రంగనాథ్ రాఘవేందర్ గౌడ్, హరి జీవన్, సాయినాథ్ రెడ్డి మధుసూదన్ గౌడ్, శ్రీనివాస్, ఆంజనేయులు, నిరంజన్ తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, జేఏసీ నాయకులు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ఎస్డివిపి జేపీసీ) చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పిసపాక ప్రభాకర్, కో-చైర్మన్లు ఏమ్మే సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, కో-కన్వీనర్ గని మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధరాచారి, నరేందర్ రెడ్డి, సంఘం సర్పంచ్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ మురికదార్ రెడ్డి, కొత్తపేట మాజీ సర్పంచ్ నవీన్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, బైకాన్‌పల్లి మాజీ సర్పంచ్ యాదగిరి, వెంకటయ్య, కొనాయపల్లి కక్షనయ్య, కొత్తూరు దేవేందర్ యాదవ్, రవీందర్, కోస్గి శ్రీను, మెండే కృష్ణ, నక్కల వెంకటేష్ గౌడ్, భాస్కర్, రవి, బాబు రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ తాండలో ప్లాస్టిక్ కంపెనీని వెంటనే తొలగించాలి

గ్రామ పెద్దల డిమాండ్

మీనాక్షి ఎంటర్‌ప్రైజెస్ ప్లాస్టిక్ కంపెనీపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి





కొత్తూరు నవంబర్ 06 (ప్రజా జ్యోతి) కొత్తూరు మండలంలోని మల్లాపూర్ తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 18లో రాంరెడ్డి అనే వ్యక్తి మీనాక్షి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ప్లాస్టిక్ కంపెనీని స్థాపించారు.కేవలం ప్లాస్టిక్ కటింగ్ మాత్రమే చేస్తామని చెప్పి కంపెనీ ప్రారంభించినప్పటికీ, ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి దుర్వాసన వెదజల్లే చెత్తాచెదారం,ఇతర వ్యర్థాలను తీసుకొచ్చి నిల్వ చేస్తుండటంతో మల్లాపూర్ తాండతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ కంపెనీ కారణంగా గ్రామంలో తీవ్రమైన దుర్వాసన వ్యాపిస్తూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోంది.చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు,జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా కంపెనీ నుంచి వెలువడుతున్న మురుగునీరు కాలువల ద్వారా రామయ్య చెరువులో కలుస్తుండటంతో చెరువు నీరు,భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కావున మండల స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఈ కంపెనీపై సమగ్ర విచారణ జరిపి,ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కార్యకలాపాలను నిలిపివేసి,కంపెనీని రద్దు చేసి మరో ప్రాంతానికి తరలించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై గ్రామ పెద్దలందరూ కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేయడం జరిగింది.మాకు కావాల్సింది డంపింగ్ యార్డులు కాదు. ఆరోగ్యకరమైన వాతావరణం. ప్రజల ఆరోగ్యమే మా మొదటి ప్రాధాన్యత.మల్లాపూర్ తాండ గ్రామ ప్రజల అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐటీఎల్ ఒక విశిష్ట ఘట్టాన్ని నమోదు చేసింది



హైదరాబాద్ (ప్రజాజ్యోతి) తమ సాహసోపేతమైన ఆశయాలను అంతర్జాతీయ విజయాలుగా మలిచే ధైర్యం గల దార్శనికులే ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన సంస్థలను నిర్మించారు. భారతదేశపు ఇంజనీరింగ్ నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తిగా రూపాంతరం చెందడానికి ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ (ఐటీఎల్) నేడు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ మిట్టల్ మాట్లాడుతూ, "అంతర్జాతీయ వేదికపై భారతదేశం యొక్క పెరుగుతున్న భాగస్వామ్యాన్ని, స్థాయిని ప్రతిబింబించే ఒక కార్యక్రమంలో భాగం కావడం ఒక గొప్ప గౌరవం. లీచ్‌టెన్‌స్టైన్ యువరాజు, హెచ్.ఎస్.హెచ్. హెరిడిటరీ ప్రిన్స్ అలోయిస్‌ను సత్కరించే ఈ విందుకు ఆహ్వానించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీకి నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. 2026లో కంపెనీ తన మూడు దశాబ్దాల ఘన ప్రస్థానాన్ని జరుపుకుంటున్న తరుణంలో, ఐటీఎల్ జాతీయ ప్రతిష్టకు సంబంధించిన ఒక విశిష్ట ఘట్టాన్ని నమోదు చేసింది.

సర్కార్ భూములపై రెవెన్యూ అధికారుల ఉక్కు పాదం.!

సర్కార్ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు..

ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో సునీత



ఇబ్రహీంపట్నం నవంబర్ 6 ప్రజాజ్యోతి: సర్కార్ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఉక్కు పాదం మోపారు. సర్కార్ భూములను ఆక్రమించాలని ఉపేక్షించేది లేదని ఎమ్మార్వో సునీత తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం, రాందాస్‌పల్లి గ్రామంలో సర్కార్ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం అదిబట్ల సర్కిల్ పరిధిలోని రాందాస్‌పల్లి గ్రామ సర్వే నంబర్ 86లో దాదాపు 10 ఎకరాల అసైన్డ్ భూమిలో అక్రమార్కులు అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను, ఎమ్మార్వో సునీత ఆదేశాలతో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవి, జీపీఓ సుదర్శన్ ఆధ్వర్యంలో తొలగించారు. అసైన్డ్ భూముల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలను ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నాయి.

ఆరోపణల రాజకీయం ఆపండి

అభివృద్ధికి అడ్డుపడకండి

పదేళ్లు అధికారంలో ఉండి ఏం సాధించారు?

ఇప్పుడు విమర్శలెందుకు?

ఆనాడు చేయని పనులు ఈనాడు గుర్తుకొచ్చాయా?

కూకట్‌పల్లి ప్రజలకు లెక్క చెప్పండి

కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

కూకట్ పల్లి నవంబర్ 5(ప్రజా జ్యోతి):- కూకట్‌పల్లి నియోజకవర్గంలో రోజురోజు రాజకీయ విమర్శల పర్వం ముదురుతోంది. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన సమయంలో ఆరోపణలు, విమర్శలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా పనిచేసిన మాధవరం కృష్ణారావు, అప్పట్లో మీ చేతిలో అధికారం ఉంది. ప్రభుత్వంపై పలుకుబడి ఉంది.నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మరి ఇప్పుడు ప్రస్తావిస్తున్న అభివృద్ధి అంశాలు ఆనాడు ఎందుకు కార్యరూపం దాల్చలేదు? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై లేదా? అని కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. మెట్రో పార్కులో స్టేడియం.. పదేళ్లు ఏం చేశారు? కూకట్‌పల్లి యువతకు స్టేడియం కావాలనే ఆలోచన ఇప్పుడే వచ్చిందా? గత పదేళ్లలో మీ ప్రభుత్వానికి ఈ సమస్య కనిపించలేదా? యువతకు క్రీడా సదుపాయాలు కల్పించాలనే చిత్తశుద్ధి ఉంటే ఆనాడే ఎందుకు నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు? ఇప్పుడు అభివృద్ధి ప్రతిపాదనలపై విమర్శలు చేయడం వెనుక ఉద్దేశమేమిటి? యువతకు సమాధానం చెప్పండి. కేపీహెచ్‌బీ--జేఎన్‌టీయూ రోడ్డు.. పెట్రోల్ బంక్‌పై ఇప్పుడే ప్రేమ ఎందుకు?

ఈ రహదారిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు అంశంపై ఇప్పుడు ప్రశ్నలు సంధిస్తున్న మీరు, గత పదేళ్లలో ఈ స్థలానికి సంబంధించిన ప్రతిపాదనలు, నిర్ణయాలపై మీ వైఖరిని వెల్లడించాలి. ఆనాడు తీసుకున్న చర్యలేమిటి? అప్పట్లో ఎందుకు స్పందించలేదు? ఇప్పుడు మాత్రమే ఈ అంశం రాజకీయ అస్త్రంగా ఎందుకు మారింది? ప్రజలకు వాస్తవాలు చెప్పాలి.

ఎన్టీఆర్ పేరుతో పాఠశాల.. హామీ ఏమైంది? నిధుల సంగతేంటి?

రమ్య గ్రౌండ్ సమీపంలో స్వర్గీయ ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మిస్తామని చెప్పిన హామీ ఏమైంది? మీ పార్టీకి చెందిన కార్పొరేటర్ నిధులు వసూలు చేశారనే ఆరోపణలపై ఇప్పటివరకు స్పష్టత ఎందుకు ఇవ్వలేదు? ఎంత మొత్తం సేకరించారు? ఎక్కడ జమ చేశారు? పాఠశాల నిర్మాణం ఎందుకు నిలిచిపోయింది? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఇతరులపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం?

పేదల సొంతింటి కలపై రాజకీయాలెందుకు?

నగరంలో అద్దె ఇళ్ల భారంతో సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు నలిగిపోతున్నారు. అలాంటి వారికి ౩×+, వీ×+ గృహాలు అందించాలనే ప్రభుత్వ ప్రతిపాదనపై రాజకీయ విమర్శలు చేయడం కంటే దాని అమలుకు సహకరించాల్సిన అవసరం లేదా? దాదాపు రూ.40 లక్షల విలువైన ఇంటిని రూ.6 లక్షలకే అందించాలనే ప్రతిపాదన, లక్ష మంది గృహ అవసరాలను తీర్చాలనే లక్ష్యం అమలైతే అది సామాన్య కుటుంబాలకు పెద్ద ఊరటగా మారుతుంది.

ఎమ్మెల్యే కృష్ణారావుకు పేదవాడికి ఇల్లు వస్తుంటే స్వాగతించాలి కానీ రాజకీయ ప్రయోజనాల కోసం అనుమానాలు రేకెత్తించడం ఎందుకు? పేదల సొంతింటి కలకు మీ సహకారం ఉంటుందా? లేదా?

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మీ బాధ్యత లేదా?

కూకట్‌పల్లి ప్రజలు మీకు వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. ఆ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. హ్యాట్రిక్ విజయం సాధించిన నాయకుడిగా నియోజకవర్గ అభివృద్ధిలో మీ పాత్ర కూడా అంతే కీలకం. గత పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరాలు ఇవ్వండి. పూర్తికాని హామీలపై స్పష్టత ఇవ్వండి. ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో లోపాలుంటే ఆధారాలతో ప్రశ్నించండి. కానీ ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్నీ రాజకీయ వివాదంగా మార్చడం వల్ల నష్టపోయేది కూకట్‌పల్లి ప్రజలే. రాజకీయ పంతాలు పక్కనపెట్టండి.. అభివృద్ధి బాట



పట్టండి! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజాప్రయోజన కార్యక్రమాలకు నిర్మాణాత్మక సహకారం అందించండి. మీ రాజకీయ అనుభవాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి వినియోగించండి. అవసరమైతే రాజకీయ వైఖరిని పునరాలోచించండి. ప్రజల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యతగా నిలవాలి. అధికారం ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు ప్రశ్నించే ముందు, ఆనాటి మీ పాలనపై ప్రజలకు సమాధానం చెప్పండి. అభివృద్ధిని అడ్డుకునే విమర్శలు కాదు. అభివృద్ధిని వేగవంతం చేసే సహకారం అందించండి!

కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సింది రాజకీయ డ్రామాలు కాదు. అభివృద్ధి కావాలి! యువతకు స్టేడియం కావాలి! పేదలకు ఇళ్లు కావాలి! విద్యార్థులకు పాఠశాలలు కావాలి! మెరుగైన మౌలిక సదుపాయాలు కావాలి.అబద్ధపు ఆరోపణలకు స్వస్తి పలకండి.అభివృద్ధికి బాటలు వేయండి. కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయండి.అంతేగాని అనవసర రాద్ధాంతం చేయడం సరైన పద్ధతి కాదు.మీ 15 సంవత్సరాల కాలంలో ఎన్ని అక్రమాలు జరిగాయో నిగ్గు తేలుస్తాం.అక్రమకేసులు, కబ్జాలు,చెరువులను చెరబట్టినా సంగతులు కూకట్ పల్లి ప్రజలకు విదితమే.నీ అనుచరుల ఆస్తులు అమాంతం ఆకాశానికి ఎదిగినయో ప్రజలందరికి తెలుసు. కాంగ్రెస్ పార్టీ ఆయంలో కూకట్ పల్లిలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవాలని చుస్తే సహించేది లేదన్నారు.

నర్కుడలో సిక్స్ బావార్చి రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





రాజేంద్రనగర్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల నర్కూడ గ్రామంలో చౌదరిగుడ ఉప సర్పంచ్ ప్రేమ్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన సిక్స్ బావార్చి రెస్టారెంట్ ను శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన రుచికరమైన బిర్యానీని వినియోగదారులకు అందించాలని అన్నారు. నర్కోడ గ్రామంలో సిక్స్ బావర్చి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువకులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సొంతంగా వ్యాపారం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం శంషాబాద్ మండల అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్,నర్కుడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్,ఉపసర్పంచ్ నీరటీ మహేష్, మాజీ సర్పంచులు సునిగంటి సిద్దులు,రమేష్ యాదవ్,రాజేందర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్,నాయకులు నీరటీ రాజు ముదిరాజ్, బండి గోపాల్ యాదవ్, శ్రీనివాస్, శివాజీ, కృష్ణ, గణేష్, రక్షిత్ గౌడ్, నీరటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఆర్ నివారణకు సమష్టి కృషి అవసరం

పీసీఐ అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ పటేల్



హైదరాబాద్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) : యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) నివారణకు ఫార్మసిస్టులు, వైద్యులు, ఆరోగ్య నిపుణులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ఎం.పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో 'స్వస్థ భారత్-యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ నిర్మూలన' ఇతివృత్తంతో రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.విద్యాధర్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వి.వి.సుబ్బారావు, కన్వీనర్ డాక్టర్ ఎం.నిరంజన్ బాబు, కో-కన్వీనర్ డాక్టర్ డి.నరేంద్ర, పీసీఐ ఐసీటీ చైర్మన్ డాక్టర్ పి.సత్యమూర్తి, సభ్యుడు ఎస్.ఎల్.ఎన్.ప్రసాద్ రెడ్డి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు పి.రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.భాస్కర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, సైంటిఫిక్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆకాశమంత అక్రమ నిర్మాణాలు

"రమణ" రహస్య వసూళ్లు

నాక్ ఇంజనీర్ల నాటకీయత

కూకట్పల్లి కలెక్షన్ కింగ్స్

రెండు సర్కిళ్లలో ఒకే అధికారి హవా?

అక్రమ నిర్మాణాలే అడ్డగోలు సంపాదనకు అడ్డా?







కూకట్ పల్లి నవంబర్ 5(ప్రజా జ్యోతి):- కూకట్‌పల్లి,మూసాపేట్ సర్కిల్ లలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతోంది. నిబంధనలకు తిలోదకాలిస్తూ ఆకాశాన్నంటే భవనాలు వెలుస్తున్నా, వాటిని అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

రెండు సర్కిళ్లకు ఒకే పెద్దదిక్కు

కూకట్‌పల్లిలోని రెండు సర్కిళ్ల పరిధిలో ఒకే అధికారి పెత్తనం కొనసాగుతోందన్న ప్రచారం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రెండు సర్కిళ్లలోనూ అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ ఎలా సాగుతోంది? బాధ్యతలు, అధికారాల నిర్వహణలో పారదర్శకత ఉందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల నియంత్రణ కంటే ఇతర వ్యవహారాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీజ్‌ల పేరుతో సరికొత్త నాటకాలా?

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందినప్పుడు హడావుడి చేయడం, నోటీసులు జారీ చేయడం, సీజ్‌ల పేరుతో సందడి చేయడం తప్ప క్షేత్రస్థాయిలో శాశ్వత పరిష్కారం కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చర్యలు తీసుకున్నట్లు కనిపిస్తున్నా, తిరిగి అదే నిర్మాణాల్లో పనులు కొనసాగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాల వెనుక ఏదైనా అంతర్గత కుమ్మక్కు ఉందా అన్నది విచారణతోనే తేలాల్సి ఉంది.

జీరో పర్మిషన్ల జోరు

అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు కూకట్‌పల్లిలో కలకలం రేపుతున్నాయి. కనీస అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు రూపుదిద్దు కుంటున్నాయనే ఫిర్యాదులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. "కారు" నాయకులతో చెట్టపట్టాలు, "హస్తంతో నేస్తం" ఇక నిర్మాణలపై చర్యలు ఏం చేపడుతారు. అనుమతులు, క్షేత్రస్థాయి తనిఖీలు, అధికారుల పర్యవేక్షణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సెల్లార్ల వినియోగానికి ఎవరి అండ?

వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో పార్కింగ్ సమస్యలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల వినియోగం జరుగుతున్నా సంబంధిత విభాగం ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ భూముల్లోనూ నిర్మాణాల పర్వమా?

ప్రభుత్వ భూముల పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత ఎవరిది? భూముల స్థితిగతులు పరిశీలించకుండా నిర్మాణాలు ఎలా ముందుకు సాగుతున్నాయి? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే సంబంధిత శాఖల పర్యవేక్షణ ఏమైనట్లు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమేనా?

అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఫిర్యాదులపై పారదర్శక విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కేవలం నోటీసులు, హెచ్చరికలకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఉన్నతాధికారులు స్పందించాలి

కూకట్‌పల్లి ప్రాంతంలో వెలుగుచూస్తున్న అక్రమ నిర్మాణాల ఆరోపణలపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. రెండు సర్కిళ్ల పరిధిలోని నిర్మాణ అనుమతులు, ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు, సీజ్ చేసిన భవనాల వివరాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణదారులతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా తేల్చాలి.

మాధవరెడ్డి మృతికి ఎమ్మెల్యేలు నివాళులు





చేవెళ్ల నవంబర్ 06(ప్రజా జ్యోతి): మల్కాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, ముడిమ్యాల పీఏసీఎస్ డైరెక్టర్ నవపేట్ మాధవరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మల్కాపూర్‌కు చేరుకుని మాధవరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో సీనియర్ నాయకుడిగా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మాధవ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

మీర్ పేట్ లో జరిగిన జంట హత్యల కేసులు చేదించిన పోలీసులు

జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ సిద్ధికి అరెస్ట్

నిందితుడు వద్ద నుండి ఒక కత్తి, మారుతి కార్, ఒక సెల్ ఫోన్ స్వాధీనం

కుటుంబ కలహాలతోనే జంట హత్యలు

శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్





రాజేంద్రనగర్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) మీర్ పేట్ లో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసును రాజేంద్రనగర్ జోన్ పోలీసులు చేధించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, నిందితుడి వద్ద నుండి హత్యకు వినియోగించిన కత్తి, కారు మొబైల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు. శుక్రవారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి, మీర్ పేట్ ఇన్స్పెక్టర్ శోభన్ తో కలిసి శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్ వివరాలు వెల్లడించారు. హయత్ కాలనీ, షరీఫ్ నగర్, బండ్లగూడ నివాసముండే మహమ్మద్ సిద్ధిఖీ (42) స్వస్థలం నల్గొండ జిల్లా ,మర్రిగూడ వృత్తిరీత్యా వ్యాపారి స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బడంగ్ పేట్,సాయి విహార్ నగర్ చెందిన మృతురాలు నిరంజన్ బీ కుమార్తెను వివాహం చేసుకున్నాడు. నిందితుడికి, అతని భార్య కుటుంబ సభ్యులకు మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయని, వారు పెద్దల సమక్షంలో తనను అవమానించారని, తనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించారని నిందితుడు కక్ష పెంచుకొని ఈ నెల 4 వ తేదీన సాయంత్రం నిందితుడు తన బామ్మర్ది యూసుఫ్ ను పని చేసే మీర్ పేట్ పెట్రోల్ బంకు వద్ద తన కారులో ఎక్కించుకొని సాయి విహార్ నగర్ లో ఇంటికి తీసుకెళ్లాడు. కుటుంబ వివాదాల కారణంగా వారిపై కక్ష పెంచుకున్న నిందితుడు సిద్ధికి, వారిని అంతం చేయాలని పథకం వేశాడు.ఈ క్రమంలోనే ఇంట్లో మాటాడుతుండగా మాట మాట పెరిగి తనతో తెచ్చుకున్న కత్తితో అత్త నిరంజన్ బి అడ్డొచ్చిన బామ్మర్ది భార్య రేష్మ, బామ్మర్ది యూసుఫ్లను కత్తితో దాడి చేయడంతో అత్త నిరంజన్ బి, రేష్మ తీవ్ర గాయాలు అక్కడికక్కడే మృతి చెందారని, యూసుఫ్ తీవ్ర గాయాలై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని హత్య అనంతరం నిందితుడు తన కారులో అక్కడి నుంచి పారిపోయాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మీర్ పేట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మీర్ పేట్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నేరాన్ని అంగీకరించాడని, అరెస్టు చేసి రిమాండ్ తరలించామని, అతని వద్ద నుంచి హత్యకు వినియోగించిన ఒక కత్తి, వ్యాగన్ఆర్ కారు, మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతురాలు రేష్మ పై లైంగిక వేధింపుల పాల్పడ్డాడని అబియోగాలు ఉన్నాయని వాటి పై కూడా దర్యాప్తు కొనసాగుతుందని డీసీపీ పేర్కొన్నారు. జంట హత్యల కేసును 24 గంటల్లోనే చేదించిన ఇన్స్పెక్టర్ శోభన్, శంషాబాద్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్, మీర్ పేట్ సబ్-ఇన్స్పెక్టర్ మహమ్మద్ అబ్దుల్ హయ్యూమ్, శంషాబాద్ టాస్క్ ఫోర్స్, మీర్ పేట పోలీస్ స్టేషన్ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారనీ నిందితులను పట్టుకోవడంలో చూపిన ప్రతిభకు గాను, పోలీస్ కమిషనర్ ఈ బృందాలను అభినందించారు.



అవిన్య-26'లో విద్యార్థుల సాంకేతిక, కళాత్మక ప్రతిభ



హైదరాబాద్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) : కేఎల్హెచ్ అజీజ్నగర్ క్యాంపస్లో రెండు రోజుల పాటు నిర్వహించిన వార్షిక సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం 'అవిన్య-2026'లో విద్యార్థులు తమ సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, కళాత్మక ప్రతిభను చాటుకున్నారు. పిచ్ వాల్ట్, ఏఐ వర్సెస్ హ్యూమన్, టెక్ మీమ్ వార్, ఏఐ వీడియో, వీఎఫ్ఎక్స్ పోటీలతో పాటు నృత్య, గాన, గిటార్, డ్రమ్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీసీఎస్ జనరల్ మేనేజర్, హెచ్ఆర్ రీజినల్ హెడ్ శ్రీకాంత్ సూరంపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఇంజనీర్ కోనేరు లక్ష్మణ్ హవీష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బృందస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. కేఎల్హెచ్ అజీజ్నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకల్లో నిర్వాహక కమిటీ, అధ్యాపకులు, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెద్దవీడు గ్రామ పంచాయతీలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసిన సర్పంచ్ చక్కటి రాజ సులోచన



షాబాద్ నవంబర్ 6(ప్రజాజ్యోతి) షాబాద్ మండలంలోని పెద్దవీడు గ్రామ పంచాయతీలో గ్రామ ప్రజలకు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చక్కటి రాజ సులోచన అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో ముఖ్యమని, ఇది ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి రేషన్ కార్డు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముచ్చింతల్ లోని చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో యతీంద్ర సప్తతి వేడుకలు

చిన్న జీయర్ స్వామి 70వ జన్మదిన మహోత్సవాలు

నవంబర్ 8 నుండి 12 వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహణ

ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలి

శ్రీ అహోబిల జీయర్ స్వామి, దేవానంద జీయర్ స్వామి



రాజేంద్రనగర్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి 70వ జన్మదినోత్సవం యతీంద్ర సప్తతి వేడుకలను రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ జీయర్ ఆశ్రమంలో నవంబర్ 8 నుండి 12 వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ అహోబిల జీయర్ స్వామి, దేవానంద జీయర్ స్వామిలు శుక్రవారం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఉత్సవాలకు ముందు కార్యక్రమాలు

ప్రధాన ఉత్సవాలకు ముందు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల్లోని వేలాది ప్రాంతాల్లో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ జరిగిందన్నారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కూడా ఈ పారాయణలు నిర్వహించారు. ముచ్చింతల్ ఆశ్రమంలోని శ్రీ సాకేతరామ ఆలయం నుండి వందలాది కలశాలను ఆయా ప్రదేశాలకు పంపగా, ఆ కలశాలు తిరిగి ఆలయానికి చేరాయి. వీటిని నవంబర్ 12న శ్రీరామునికి నిర్వహించే సహస్ర కలశాభిషేకానికి వినియోగించనున్నారు.

నవంబర్ 8 – పండిత సత్కారం

మచిలీపట్నంకు చెందిన వేద, ద్రావిడ ప్రబంధ పండితులు శ్రీమాన్ గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు గారికి 36వ జీయర్ పురస్కారం, తమిళనాడుకు చెందిన జైమినీ సామవేద నిష్ణాతులు శ్రీమాన్ ఎన్.మకరభూషణం అయ్యంగార్ గారికి 37వ జీయర్ పురస్కారం, 50 మందికి పైగా విద్యార్థులకు పీహెచ్డీ మార్గదర్శనం చేసిన ఆచార్య కందాల వెంకట రామకృష్ణమాచార్యులు గారికి 3వ విద్వన్మణి పురస్కారం ప్రదానం చేయనున్నారు.

నవంబర్ 9 – సుందరకాండ పారాయణం, ఆచార్య వైభవం

అమావాస్య సందర్భంగా ఉదయం 5 గంటల నుండి సుందరకాండ పారాయణం ప్రారంభమవుతుంది. హనుమంతునికి లక్ష వడలు, లక్ష కొబ్బరికాయలు సమర్పించనున్నారు. సాయంత్రం సమతా మూర్తి వద్దకు చేరే 108 మెట్లకు ప్రతీకగా 108 శ్లోకాలతో ఆచార్య వైభవం కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు.

నవంబర్ 10 – మంగళ తరంగిణి

లోక శాంతి కోసం విష్ణు సహస్రనామ పారాయణం, నరసింహ ప్రార్థన సామూహికంగా జరుగుతాయి. వేలాది మంది భక్తులు పాల్గొని గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నవంబర్ 11 – సమతా పురస్కారం, మాతృసవనం

దేశం కోసం సేవలందించిన రక్షణ దళాలు, రక్షణ ప్రయోగశాలలకు చెందిన 70 మందిని సమతా పురస్కారంతో, సమాజ సేవలో ప్రతిభ చూపిన 70 మంది మహిళా సాధకులను మాతృసవనం కార్యక్రమంలో సత్కరించనున్నారు.

నవంబర్ 12 – ఏకోత్తర సహస్ర కలశాభిషేకం

ఉత్సవాల ముగింపుగా ప్రపంచవ్యాప్తంగా భక్తుల ప్రార్థనల నుండి తిరిగి వచ్చిన కలశాలతో శ్రీరామునికి ఏకోత్తర సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు.

తాగుడుకు బానిసై వ్యక్తి మృతి.

దుర్వాసనతో బయటపడ్డ మృతుని శవం వివరాలు.



కోటపల్లి నవంబర్ 6(ప్రజా జ్యోతి):కోటపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన జంగిలి బాబు తండ్రి లక్ష్మయ్య వయసు 50 సంవత్సరాలు వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవాడు గత కొంతకాలంగా రాంపూర్ లో ఒంటరిగా ఉంటున్నాడు తన భార్య వెంకటమ్మ , కొడుకులు మనోజ్, ప్రశాంత్ ముగ్గురు హైదరాబాద్ లో ఉంటున్నారు అయితే మొన్న అనగా నవంబర్ 5న 2026 నాడు చిరంజీవి అనే వ్యక్తి మృతుడు ఇంటి దగ్గరికి నీళ్లు పట్టుకోవడానికి వెళ్లగా ఇంటి నుండి దుర్వాసన రావడంతో అట్టి విషయం మృతుని భార్య వెంకటమ్మకు ఫోన్ చేసి తెలుపగా ఆమె వెంటనే తన కొడుకులతో పాటు రాంపూర్ కు వచ్చి చూడగా తన భర్త చనిపోయి ఉన్నాడు దాంతో ఆమె నా భర్తకు తాగుడు అలవాటు ఉండటం వలన చనిపోయాడని అట్టి విషయంలో ఎవరిపైన అనుమానం లేదని ఫిర్యాదు చేయడం జరిగింది దానిపై కేసు నమోదు చేసి విచారణ చేయడం జరుగుతుంది స్థానిక ఎస్సై మీనాక్షి తెలిపారు.

నార్సింగి సర్కిల్ పరిధిలో రూ.6.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రారంభోత్సవాలు చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్







రాజేంద్రనగర్, నవంబర్ 06 (ప్రజా జ్యోతి) సైబర్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ పరిధిలో రూ. 6 కోట్ల 48 లక్షల 60 వేల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ నార్సింగి, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గండిపేట్ ప్రాంతాల అభివృద్ధే తన లక్ష్యమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి రోడ్లు, పార్కులు, లైబ్రరీ తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా నార్సింగి, గండిపేట్, వట్టినాగులపల్లి ప్రాంత ప్రజలకు రోడ్డు, పార్కు, లైబ్రరీ తదితర మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి.

ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటేష్ యాదవ్, అశోక్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు,మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

200 రోజుల పని.. రోజుకు రూ.800 కూలీ చెల్లించాలి : వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



పరిగి /హైదరాబాద్, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించాలని, కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.800 కూలీ చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్లోని గ్రామీణ అభివృద్ధి రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన కూలీలకు కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నా అనంతరం రాష్ట్ర కమిషనర్ దివ్యను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధి కూలీల హక్కుల సాధన కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ. నాగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, మహిళా కన్వీనర్ పద్మ, రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటయ్య, గోపాలు, నరసింహ, పెద్ది వెంకట రాములు, రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకత్వం పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు, అదనపు ఆదాయం

రైతులకు శాస్త్రీయ అవగాహన.. తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ, క్షేత్ర పర్యటన





షాబాద్ నవంబర్ 6 (ప్రజాజ్యోతి) సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా 40 మంది ప్రగతిశీల రైతులకు శిక్షణ, క్షేత్ర పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని షాబాద్, చేవెళ్ల మండలాలకు చెందిన రైతులు మెదక్ జిల్లాలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల తయారీ, వినియోగంపై వివరించారు. వర్మీ కంపోస్ట్, సూడోమోనాస్, ట్రైకోడెర్మా, జింక్, పొటాషియం, ఫాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా, ఎన్‌పీకే మిశ్రమం, బ్యూవేరియా బాసియానా, మెటారైజియం తదితర జీవ ఉత్పత్తుల తయారీ, పంటల్లో వాటి వినియోగ విధానాలను వివరించారు. వీటి ద్వారా నేల సారవంతం పెరగడంతో పాటు పంటలకు సోకే చీడపీడలను నియంత్రించవచ్చని తెలిపారు.

కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శంబాజీ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, పెరటి కోళ్ల పెంపకం, పశుపోషణ వంటి అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. వీటి ద్వారా అదనపు ఆదాయం పొందడంతో పాటు పశువుల ఎరువులను పొలాలకు వినియోగించడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం, పోషకాలు పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు.

వెల్‌స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, రైతులకు గిట్టుబాటు ధరలు అందించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు దిశగా కృషి చేస్తామని తెలిపారు. అలాగే జీవ వనరుల కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన జీవ ఎరువులు, జీవ నియంత్రణ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు మొదటి సంవత్సరంలో షాబాద్, చేవెళ్ల మండలాల్లో 200 మంది రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించేందుకు బేస్‌లైన్ సర్వే ద్వారా రైతులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపికైన రైతులకు భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ, జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాలు, వంటింటి తోటల కిట్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. రైతులు ఈ శిక్షణలో నేర్చుకున్న పద్ధతులను తమ పొలాల్లో అమలు చేసి సేంద్రియ సాగును ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముద్దెంగూడ, లక్ష్మారావుగూడ, చన్వెల్లి, అంతారం, బొబ్బిలిగామ, దేవుని ఎర్రవల్లి, అల్లవాడ, కక్కులూరు, కుర్వగూడ, మన్మరి తదితర గ్రామాలకు చెందిన ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు సమన్వయకర్త ఎన్. శ్రీకాంత్, బి. రామకృష్ణ, పెసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

అధిక ధరలకు బియ్యం అమ్మే వారిపై చర్య తీసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్.



కుత్బుల్లాపూర్ నవంబర్ 6(ప్రజా జ్యోతి) ఎల్ నినో అనే కారణాన్ని చూపి గత కాలంలో పండిన పంట నుండి వచ్చిన బియ్యము అప్పటి రేటు ప్రకారం అమ్మకుండా దిగుబడి తక్కువ ఉందని ప్రచారం చేసి బియ్యం ను అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఇది ముమ్మాటికి ప్రజలను మోసం చేయడమేనని కావున అధిక ధరలకు అమ్మే వ్యాపారస్తుల పై చర్యలు తీసుకోవాలని నేడు సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మరియు రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బియ్యంను నిర్ణయించిన ధరలకే అమ్మాలని నిన్న చేసిన ప్రకటనను సిపిఐ గా స్వాగతిస్తున్నామని కానీ బియ్యం అమ్మే వ్యాపారస్తులు విజిలెన్స్ అధికారులు ఎక్కడ దాడి చేస్తారోనని సాయంత్రం వేళ అధిక ధరలకు అమ్ముకుంటూ ఉదయం సమయంలో షాపులు మూసివేసి ఉంచుతున్నారని కావున అధికారులు వారిపై నిరంతర నిఘాను ఏర్పాటు చేసి అధిక ధరలకు అమ్మే వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వమే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రేషన్ మరియు నిత్యవసర వస్తువులను అమ్మితే అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉంటుందని ఆ దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వారి పైన కేసు నమోదు చేయాలని సిపిఐ గా బ్లాక్ మార్కెట్ దందాలపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ రాష్ట్ర సమితి సభ్యులు కే ఏసురత్నం మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండల అధ్యక్షుడు బాబు, ఏ ఐ వై ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్ కీర్తి సిపిఐ నాయకులు జానకిరామ్ ఇమామ్ ,నారాయణ, నరసింహ మరియు ప్రవీణ్లు పాల్గొన్నారు.

బోయినపల్లి ప్లే గ్రౌండ్‌లో కూల్చివేస్తున్న భవనాలను తిరిగి నిర్మించాలి

రూ.కోటి నిధులు కేటాయించాలి.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి జంపన ప్రతాప్ వినతి



బోయిన్ పల్లి, నవంబర్ 6.(ప్రజా జ్యోతి): ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్ వరకు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బోయినపల్లి ప్లే గ్రౌండ్‌లోని జిమ్, రెజ్లింగ్, కంప్యూటర్ శిక్షణ కేంద్రాల భవనాలను కూల్చివేస్తున్న నేపథ్యంలో వాటిని తిరిగి నిర్మించాలని కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని జంపన ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, రోడ్డు విస్తరణ కారణంగా క్రీడాకారులు, యువత శిక్షణ పొందుతున్న మూడు భవనాలు తొలగించాల్సి వస్తోందని ఆయన వివరించారు.ఈ భవనాలు యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, క్రీడాకారులకు శిక్షణ అందించే జిమ్, రెజ్లింగ్ కేంద్రాలతో పాటు కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని తిరిగి నిర్మించేందుకు సుమారు రూ.కోటి వ్యయం అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రత్యామ్నాయ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.జంపన ప్రతాప్ వినతిపై సానుకూలంగా స్పందించిన షబ్బీర్ అలీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్ (ఐఏఎస్)కు సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున షబ్బీర్ అలీకి జంపన ప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ బాంటియా పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం అమలు గాలికి వదిలేశారా?

ఉప్పల్, అబిడ్స్ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డుల దుస్థితిపై రాపోలు లింగస్వామి ఆగ్రహం





అబ్దుల్లాపూర్ మెట్/ నవంబర్ 06 (ప్రజాజ్యోతి) సామాన్యులకు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కల్పించేందుకు తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం (2005) అమలు అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోందని ఆర్టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన సూచిక బోర్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి బోర్డు సగం పాడైపోయి, అసంపూర్తి సమాచారంతో నిరుపయోగంగా కనిపించడాన్ని గుర్తించారు. అదేవిధంగా అబిడ్స్‌లోని మరో ప్రభుత్వ కార్యాలయంలోనూ సంబంధిత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు లేకుండా అసంపూర్తి సమాచారంతో బోర్డులు దర్శనమిచ్చాయని తెలిపారు.ఈ సందర్భంగా రాపోలు లింగస్వామి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి దాదాపు 22 ఏళ్లు గడుస్తున్నా, నేటికీ సామాన్య ప్రజలకు చట్టంపై పూర్తిస్థాయి అవగాహన, సమాచారం అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఏ కార్యాలయంలో ఏ అధికారి వద్ద సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి? సంబంధిత ప్రజా సమాచార అధికారి ఎవరు? ఆయనను ఎలా సంప్రదించాలి? అనే కనీస వివరాలు కూడా బోర్డులపై లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సిన ఆర్టీఐ సూచిక బోర్డులు ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సింది పోయి, అసంపూర్తి సమాచారంతో దిష్టిబొమ్మల్లా దర్శనమివ్వడం అధికారుల పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చట్టం లక్ష్యం దెబ్బతింటోందని మండిపడ్డారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఈ పరిస్థితి ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లోని కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. చట్టం ద్వారా ప్రజలకు అందాల్సిన సమాచారం సక్రమంగా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా, సంపూర్ణంగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పాడైపోయిన, అసంపూర్తి సమాచారంతో ఉన్న పాత బోర్డులను తొలగించి, సంబంధిత ప్రజా సమాచార అధికారులు, వారి హోదాలు, పేర్లు, సంప్రదింపు ఫోన్ నంబర్లు, దరఖాస్తు విధానం తదితర వివరాలతో కూడిన నూతన ఆర్టీఐ సూచిక బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. చట్ట నిబంధనలను పాటించని అధికారులపై బాధ్యత నిర్ధారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

సమాచార హక్కు ప్రజల హక్కు.. అది కార్యాలయాల గోడలకే పరిమితం కాకుండా ప్రతి సామాన్యుడికి అందుబాటులోకి రావాలి అని రాపోలు లింగస్వామి స్పష్టం చేశారు.

అంగన్వాడి పోస్టులకు అదిరిపోయే దరఖాస్తులు

గడి అంగన్వాడి టీచర్ పోస్టుకు 60 మంది దరఖాస్తు

దరఖాస్తులను పరిశీలించిన సిడిపిఓ కాంతారావు,ఎసిడిపివో శ్రీలక్ష్మి





తాండూరు నవంబర్ 6 ప్రజా జ్యోతి :- వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు నిరుద్యోగుల నుండి భారీగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఐసిడిఎస్ అధికారులు టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు తాండూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఐసిడిఎస్ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో స్థానికులకే అధిక ప్రాధన్యత ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డ్ కౌన్సిలర్ మోహిజ్ అహ్మద్, సూపర్వైజర్లు తదితరులు ఉన్నారు.

చంద్రధనలో కుక్కల దాడిలో పది మేకపిల్లలు మృతి

కన్నీరు మున్నీరుగా బాధిత కుటుంబం..ప్రభుత్వం ఆదుకోవాలని వినతి





తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో కుక్కల దాడిలో పది మేకపిల్లలు శుక్రవారం మృతి చెందాయి.గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ కొత్త మహేష్ కు చెందిన 10 మేక పిల్లలను తమ ఇంటి వద్ద ఉన్న మేకల దొడ్డిలోనే కుక్కలు దాడి చేసి చంపేశాయి.దానయ్య మరియు వారి కుమారులు మేకలు మేపడానికి ఉదయమే బయటికి వెళ్లిపోయారు.మధ్యాహ్నం సమయంలో దొడ్డిలో ఉన్న మేకపిల్లలపై కుక్కలు దాడి చేసి చంపివేయడంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.ఒక్కసారిగా 10 మేకపిల్లలు చనిపోవడంతో ఆ కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది.మేకల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న తమకు ఇది పెద్ద దెబ్బ అని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.గ్రామంలో గత కొంతకాలంగా వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని,చిన్న పిల్లలు, వృద్ధులు బయట తిరగడానికి కూడా భయపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు.గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని,అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.అదేవిధంగా గ్రామంలో కుక్కల బెడదను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని,కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించాలని గ్రామ పాలకులను,అధికారులను గ్రామస్తులు,యువకులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు దీపావళి కానుకలు

వెయ్యి మంది కార్మికులకు స్వీట్ బాక్సుల పంపిణీ



బోయిన్ పల్లి, నవంబర్ 06.(ప్రజా జ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని ఎంపీ ఈటల రాజేందర్ సూచన మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని 1వ వార్డు నుంచి 8వ వార్డు వరకు విధులు నిర్వహిస్తున్న సుమారు వెయ్యి మంది పారిశుధ్య కార్మికులకు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ఎండా, వానలను సైతం లెక్కచేయకుండా నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. సమాజానికి ఎంతో సేవ చేస్తున్న కార్మికులతో దీపావళి పండుగ సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో స్వీట్ బాక్సులు పంపిణీ చేసినట్లు తెలిపారు.పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి, వారి కుటుంబాల సంతోషానికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ పరిధిలోని ఎనిమిది వార్డులకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండారెడ్డి సుమన్ కుమారుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన ఎమ్మెల్యే శంకర్

వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు..

హాజరైన షాద్ నగర్ జర్నలిస్టులు కెపి, భవాని వేణుగోపాల్, రాఘవేందర్ గౌడ్,మధుసూదన్ గౌడ్ తదితరులు





కొత్తూరు నవంబర్ 06 (ప్రజా జ్యోతి) కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొండారెడ్డి సుమన్ కుమారుడి జన్మదిన వేడుకలు ఝాన్సీమియా గూడలోని ఓ మినీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరై చిన్నారిని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు మంచనపల్లి శివశంకర్ గౌడ్, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, సుదర్శన్ గౌడ్ తదితరులు హాజరై చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. ఈ వేడుకల్లో జర్నలిస్టుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీనియర్ జర్నలిస్టు కేపీతో పాటు భవాని వేణుగోపాల్, రాఘవేంద్ర గౌడ్, హరి జీవన్, మధుసూదన్ గౌడ్, శ్రీనివాస్, సాయినాథ్ రెడ్డి తదితర జర్నలిస్టులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ సర్పంచ్ రాజు, కాంగ్రెస్ నాయకులు ఇందూరి శ్రీనివాస్, కర్రోల సురేందర్, రాములు గౌడ్, యువ నాయకుడు నవీన్ చారి, గోవిందు నాయక్, బోకుల రాజు తదితరులు పాల్గొని వేడుకల్లో సందడి చేశారు. పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, జర్నలిస్టులు ఒకే వేదికపై కలవడంతో జన్మదిన వేడుకలు సందడిగా సాగాయి.



ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ ఆదాయం 19 శాతం వృద్ధి



హైదరాబాద్, నవంబరు 06 (ప్రజా జ్యోతి) : ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.2,829 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ ఆజాద్ మూపెన్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్ ఎండీ, సీఈఓ వరుణ్ ఖన్నా తోకలసి ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఆదాయం 19 శాతం, సర్దుబాటు చేసిన నికర లాభం 34 శాతం పెరిగి రూ.281 కోట్లకు చేరిందని తెలిపారు. ఈ త్రైమాసికంలో 22 లక్షల మందికి వైద్యసేవలు అందించగా, పడకల వినియోగం 68 శాతానికి పెరిగిందన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సలు 39 శాతం, మూత్రపిండ మార్పిడి చికిత్సలు 31 శాతం, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు 29శాతం వృద్ధి చెందాయన్నారు. విదేశీ రోగుల సంఖ్య 31 శాతం పెరిగినట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ, బంజారాహిల్స్ విభాగాలతోపాటు బెంగళూరులోని ఆస్టర్ సీఎంఐ, రాయ్‌పూర్‌లోని రామకృష్ణ కేర్, కొచ్చిలోని ఆస్టర్ మెడ్‌సిటీ, కాసరగోడ్‌లోని మిమ్స్ ఆసుపత్రుల్లో వైద్యసేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. తిరువనంతపురంలోని ఆస్టర్ ప్రాజెక్టును కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ డైరీ ఆధ్వర్యంలో చౌదర్‌పల్లిలో పాడి రైతులకు స్టీల్ పాల క్యాన్ల పంపిణీ

పాడి రైతులకు ఉచితంగా రూ.2లక్షల ప్రమాద బీమా కల్పిస్తామని హామీ

టరుకు రూ.50 పైసల బోనస్ తో పాటు డైరీ లోన్లు అందిస్తామని వెల్లడి

ముఖ్య అతిథిలుగా పాల్గొన్న హెడ్ ప్రొక్యూర్మెంట్ రామ్మోహనరావు,రీజియన్ హెడ్ నర్సింగ్ రావు







తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): హెరిటేజ్ డైరీ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో పాడి రైతులకు స్టీల్ పాల క్యాన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెరిటేజ్ డైరీ హెడ్ ప్రొక్యూర్మెంట్ రామ్మోహనరావు,హైదరాబాద్ రీజియన్ హెడ్ నర్సింగ్ రావు,ఏరియా మేనేజర్ భాష హాజరయ్యారు. తలకొండపల్లి సీసీ పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో హెరిటేజ్ లో పాలు పోసే పాడి రైతులకు స్టీల్ పాల క్యాన్లు పంపిణీ చేశారు. చాలా మంది రైతులు ఇప్పటివరకు ప్లాస్టిక్ క్యాన్లలోనే పాలు పోస్తున్నారని,దానివల్ల పాలు త్వరగా చెడిపోయి,వెన్న శాతం తగ్గి రైతులకు నష్టం వస్తుందని అధికారులు తెలిపారు. ప్లాస్టిక్ క్యాన్లతో పాలు చెడిపోయే ప్రమాదం ఉండగా,స్టీల్ క్యాన్లతో పాలు నాణ్యంగా,పరిశుభ్రంగా ఉంటాయని,పాలలో వెన్న శాతం కూడా తగ్గకుండా ఉంటుందని వివరించారు. అందుకే రైతులకు స్టీల్ క్యాన్లు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. స్టీల్ క్యాన్లను శుభ్రం చేయడం కూడా సులభమని,పాలు ఎక్కువ సేపు తాజాగా ఉంటాయని తెలిపారు. పాడి రైతులు రోజూ ఉదయం,సాయంత్రం పాలు పోస్తారని,పాలు నాణ్యంగా ఉంటేనే మంచి రేటు వస్తుందని అధికారులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ... హెరిటేజ్ డైరీలో పాలు పోసే ప్రతి పాడి రైతుకు ఉచితంగా రూ. 2లక్షల ప్రమాద బీమా కల్పిస్తామన్నారు.రైతు కుటుంబానికి ఇది ఎంతో భరోసా కల్పిస్తుందన్నారు.ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ బీమా అండగా నిలుస్తుందన్నారు.అదేవిధంగా సబ్సిడీ ద్వారా దాణా,కాల్షియం, మినరల్ మిక్చర్స్, నట్టల మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.దీంతో పశువులు ఆరోగ్యంగా ఉండి,పాల దిగుబడి పెరుగుతుందన్నారు.పశువులకు సరైన పోషణ ఉంటేనే పాల దిగుబడి పెరుగుతుందని,రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని,నట్టల మందులు వేసుకోవాలని రైతులకు సూచించారు.పశువులు అనారోగ్యం పాలైతే వెంటనే వెటర్నరీ డాక్టర్ ను సంప్రదించాలని,సొంత వైద్యం చేయవద్దని తెలిపారు.పాడి రైతులకు లీటరుకు రూ.50 పైసల చొప్పున బోనస్ అందిస్తున్నామన్నారు.పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడుపాటుగా డైరీ లోన్లు అందించడం జరుగుతుందని తెలిపారు.కొత్తగా ఆవులు,గేదెలు కొనుగోలు చేయాలనుకునే రైతులకు,షెడ్ల నిర్మాణానికి లోన్లు అందిస్తామన్నారు.పాడి రైతులు కేవలం పాలు పోయడంతోనే సరిపెట్టుకోకుండా,పశువుల సంఖ్య పెంచుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు.హెరిటేజ్ డైరీ ఎప్పుడూ రైతుల వెన్నంటే ఉంటుందని భరోసా ఇచ్చారు.హెరిటేజ్ డైరీలో పాలు పోసే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పరిశుభ్రమైన పాలు పోస్తేనే మంచి రేటు,మంచి బోనస్ వస్తుందని రైతులకు సూచించారు. క్యాన్లు,పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని,సమయానికి పాలు పోయాలని తెలిపారు.క్యాన్లు అందుకున్న రైతులు హెరిటేజ్ డైరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.స్టీల్ క్యాన్లతో తమకు ఎంతో మేలు జరుగుతుందని,పాల నాణ్యత పెరిగి మంచి ధర వస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.బీమా,బోనస్,లోన్ల సౌకర్యం తమ కుటుంబాలకు ఎంతో అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సీసీ ప్లాంట్ మేనేజర్ స్వామి గౌడ్,సూపర్ వైజర్ శివ,డాక్టర్ ప్రభాకర్,పవన్ వెట్ అసిస్టెంట్,పాల సేకరణ ప్రతినిధి రవి,సర్పంచ్ భారతమ్మ గోపాల్,గ్రామ పెద్దలు మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

(టీ డబ్ల్యూ జేఎఫ్)తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్



కుత్బుల్లాపూర్ నవంబర్ 6(ప్రజా జ్యోతి) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీ డబ్ల్యూ జేఎఫ్)అనేది రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ మరియు వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడే ఒక ప్రముఖ పాత్రికేయ సంఘం.క్షేత్రస్థాయి రిపోర్టర్ల నుండి డెస్క్ జర్నలిస్టుల వరకు అందరికీ అండగా నిలబడటమే ఈ సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సేవలను అభినందిస్తూ, సమాజంలో వారి బాధ్యతను గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలియజేశారు.

ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ నవంబర్ 6(ప్రజా జ్యోతి) కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.

ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల సాకారం: మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్





పరిగి, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతగానో దోహదపడుతుందని పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు. శుక్రవారం పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన మాల యాదమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డి కృషితో పరిగి నియోజకవర్గంలో 3 వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ఈ పథకం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, కౌన్సిలర్లు చంద్రయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పడకల్ లో ఎయిర్టెల్ టవర్ పనులు నిలిపివేత

20 రోజుల సిపిఎం పోరాటం ఫలించింది - ఎమ్మార్వో ఆధ్వర్యంలో టవర్ రద్దు





తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో ఇండ్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్టెల్ టవర్ పనులను అధికారులు శుక్రవారం నిలిపివేశారు.ఎయిర్టెల్ టవర్ ఇండ్ల మధ్యలో ఉండవద్దని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు గత 20 రోజుల నుంచి పోరాటం చేస్తున్నారు.టవర్ వల్ల రేడియేషన్ సమస్యలు వచ్చి ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని,ముఖ్యంగా చిన్న పిల్లలు,వృద్ధులు,గర్భిణీ స్త్రీలపై ప్రభావం పడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.గత 20 రోజులుగా గ్రామస్తులు టవర్ నిర్మాణం వద్దని నిరసనలు,ధర్నాలు చేపట్టారు.అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు.అయినా పనులు కొనసాగుతుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సిపిఎం నాయకులు గ్రామస్తులకు అండగా నిలిచి పోరాటాన్ని ముందుండి నడిపించారు.శుక్రవారం ఈ పోరాటం ఫలితంగా ఎమ్మార్వో కే రమేష్ కుమార్ ఆధ్వర్యంలో టవర్ పనులను బంద్ చేయించడం జరిగింది.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.తమ పోరాటానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి సిపిఎం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఇండ్ల మధ్య నుంచి టవర్ ను పూర్తిగా తొలగించి,గ్రామానికి దూరంగా,జనావాసాలు లేని ప్రాంతంలో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడవద్దని అధికారులను కోరారు.

జగద్గిరిగుట్టలో పోలీసుల ఆపరేషన్ చబుత్రా.. అర్ధరాత్రి ప్రత్యేక పెట్రోలింగ్, అనుమానాస్పదంగా తిరిగేవారికి కౌన్సెలింగ్



కుత్బుల్లాపూర్ నవంబర్ 6(ప్రజా జ్యోతి) ఆపరేషన్ చబుత్రాలో భాగంగా నిన్న రాత్రి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు కుత్బుల్లాపూర్ ఎస్ ఓ టీ సిబ్బంది కలిసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించడం జరిగింది.ఈ ఆపరేషన్లో భాగంగా రాత్రి సమయాల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించడం జరిగింది.

ఆగ్రోఫారెస్ట్రీ సాగుతో రైతులకు అదనపు ఆదాయం

జిల్లా ఉద్యానవన అధికారి సురేష్

నీటి లభ్యతకు అనుగుణంగా విరివిగా చెట్ల పెంపకం

ఆగ్రో ఫారెస్ట్రీ పద్ధతులతో దీర్ఘకాలిక ఆదాయ వనరులు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన





యాచారం, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): మండలంలోని రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ..రైతులు సంప్రదాయ వ్యవసాయ పంటలతో పాటు ఆగ్రోఫారెస్ట్రీ విధానాన్ని కూడా అనుసరించాలని చెప్పారు. వేప, చింత, ఇప్ప, కుంకుడు, మునగ వంటి చెట్లను తమ భూముల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పెంచడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ చెట్ల ద్వారా లభించే కాయలు, విత్తనాలు, ఆకులు, ఇతర ఉత్పత్తులకు మార్కెట్లో మంచి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా కుంకుడు, వేప, చింత వంటి చెట్ల ఉత్పత్తులకు వివిధ పరిశ్రమల్లో వినియోగం ఉందని తెలిపారు. మునగ సాగు ద్వారా ఆకులు, కాయల రూపంలో తక్కువ కాలంలోనే ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. రైతులు ఆగ్రోఫారెస్ట్రీ పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యవసాయంతో పాటు దీర్ఘకాలిక ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. రైతులు ఆగ్రోఫారెస్ట్రీ పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యవసాయంతో పాటు దీర్ఘకాలిక ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. అవగాహనలో జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ ఏడిహెచ్ అరుణ, సిఎస్ఏ సభ్యులు రాంబాబు, ఉద్యాన శాఖ అధికారి నవీన, వ్యవసాయ అధికారి రవినాథ్, హెచ్ఈఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ తాళాలతో భారీ చోరీ.. రూ.75 లక్షల సొత్తు స్వాధీనం!

బంధువుల సమాచారంతోనే దొంగతనం.. నిందితుడి అరెస్ట్



బోయిన్ పల్లి, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): నకిలీ తాళాలతో ఇంట్లోకి ప్రవేశించి భారీ చోరీకి పాల్పడిన కేసును నేరేడ్‌మెట్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి సుమారు రూ.75 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పద్మావతి అనే మహిళ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంటి పరిస్థితులు, తాళాల వివరాలు తెలిసిన వ్యక్తుల సమాచారంతోనే ఈ చోరీకి పథకం రూపొందించినట్లు విచారణలో తేలింది.పద్మావతి సోదరి కుమార్తెకు గతంలో ఒకే కళాశాలలో చదువుకున్న చంద్రశేఖర్‌తో పరిచయం ఉంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆమె, చంద్రశేఖర్‌కు నకిలీ తాళాలు అందించి ఇంట్లో చోరీ చేయాలని సూచించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో చంద్రశేఖర్ నకిలీ తాళాల సహాయంతో ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించినట్లు వెల్లడించారు.ఈ కేసును ఛేదించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రూ.75 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ వెల్లడించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి: మంత్రి శ్రీధర్‌బాబుకు కాప్రా ప్రెస్ క్లబ్ వినతి



ఉప్పల్, నవంబర్ 06: కాప్రా ప్రాంతంలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు నివేశన స్థలాలు (ఇళ్ల స్థలాలు) కేటాయించాలని కోరుతూ కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. చర్లపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిల సమక్షంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారని ప్రెస్ క్లబ్ నేతలు తెలిపారు.జర్నలిస్టుల సేవలను గుర్తించి, కాప్రా ప్రాంతంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి వెంకట యోగి రామచంద్ర మూర్తి, ముఖ్య సలహాదారులు బేలిదే అశోక్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు పలుగుల పవన్, క్లబ్ ఉపాధ్యక్షులు యావాపురం రవి, వెంకట్, శనిగరం అశోక్, గాదె రాము, రమేష్, అమరేందర్, భవాని శంకర్, చుక్కా రమేష్, నిరంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుక.. ఆలయాలకు చేయూత!

ఆలయాలకు రూ.51 వేల విరాళం

కుమారుడి పుట్టినరోజున శ్రీరాములు ఔదార్యం



చేవెళ్ల, నవంబర్ 06(ప్రజా జ్యోతి): కుమారుడి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని తొల్కట్ట శ్రీరాములు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డులో నూతనంగా నిర్మిస్తున్న ఊరడమ్మ, మైసమ్మ దేవాలయాల నిర్మాణానికి రూ.51 వేల విరాళం అందజేశారు. తన కుమారుడు రాకేష్ పుట్టినరోజు సందర్భంగా 1వ వార్డు కౌన్సిలర్ దూత మల్లేష్, 2వ వార్డు కౌన్సిలర్ డప్పు సువర్ణ చందు, వార్డు సభ్యుల సమక్షంలో ఈ విరాళాన్ని అందించారు. పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. దాతల సహకారంతో దేవాలయాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తవుతాయని వార్డు ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తొల్కట్ట శ్రీరాములు, ఆయన కుమారుడు రాకేష్‌కు వార్డు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైష్ణవి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

జేబీఐటీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

తెలంగాణ మాదిగ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కడుమూరు రాములు



చేవెళ్ల నవంబర్ 06(ప్రజా జ్యోతి): జేబీఐటీ కళాశాల విద్యార్థిని వైష్ణవి మృతి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ మాదిగ విద్యార్థి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కడుమూరు రాములు డిమాండ్ చేశారు. ఎమ్మెస్ఎఫ్ ఆధ్వర్యంలో జేబీఐటీ కళాశాల ఎదుట విద్యార్థిని మృతిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కడుమూరు రాములు మాట్లాడుతూ.. కళాశాలలో ప్రొఫెసర్ ఉపేందర్ వేధింపుల కారణంగానే వైష్ణవి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాలలో విద్యార్థులు ప్రొఫెసర్ల వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇందుకు యాజమాన్యం బాధ్యత వహించాలని అన్నారు. గతంలోనూ కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలు జరిగినట్లు పేర్కొంటూ, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని, వారికి సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆమనగల్ పీఏసీఎస్ చైర్మన్ గూడురు శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం



తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల పీఏసీఎస్ చైర్మన్ గా నియమితులైన గుడురు శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఆయన నివాసంలో కలిసిన కాంగ్రెస్ నాయకులు శాలువా,పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.రైతులకు మెరుగైన సేవలు అందించి,సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి చైర్మన్ పదవి దక్కడం పట్ల నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఆయన నాయకత్వంలో పీఏసీఎస్ మరింత బలోపేతం అవుతుందని,రైతులకు రుణాలు,ఎరువులు,విత్తనాలు సకాలంలో అందుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గుడురు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన నాయకులకు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని,పీఏసీఎస్ ద్వారా ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా పని చేస్తానని హామీ ఇచ్చారు.పార్టీని,రైతులను ఎప్పుడూ ముందుంచుకుని పని చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేగూరి వెంకటేష్, సిలారి, షాబుద్దీన్, బాలరాజా, రాజేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.


కో లివింగ్ హాస్టల్లు మూసివేయాలి: కొండల్ రెడ్డి





శేరిలింగంపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): కో లీవింగ్ హాస్టల్ వల్ల ఒకే రూంలో అమ్మాయి అబ్బాయి పెళ్లి కాకుండానే కలిసి కాపురం చేయుచున్నారు,మన హిందూ సంప్రదాయం ప్రకారం కలసితాం చేయుచు ఎక్కడో ప్రచాత దేశం లో ఉన్న సంస్కృతిని మన వాళ్లు నడ మత్రాప్ సిరి వచ్చి ఇలాంటి పోకడలకు పోయి కొందరు వారి జీవితలు నాశనం చేసుకొనుచున్నారు.ఇప్పటికైనా శేరిలింగంపల్లి వివిధ ప్రాంతాలలో ఉన్న ఈ కో లీవింగ్ హాస్టళ్ళను వెంటనే హరి కట్టాలి అనీ,ఈ హాస్టల్ పక్కన ఉండ్డే కుటుంబాలు వారి వెకిలి చేష్టల ఇంబందులకు గురైవుచున్నారు వాహనాలు ఇస్తారిటీనా పార్కింగ్ చేసి ఇతర వాహనాలు రాకుండా చేయుచున్నారు సైబరాబాద్ పోలీస్ కమీషనర్ గార్లకు పిర్యాదు చేసాము అని సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి తెలిపారు

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారంతో పి.టి. శ్రీనివాస్‌కు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఎల్బీనగర్ నవంబర్ 6 (ప్రజా జ్యోతి) చైతన్యపురి డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌కు చెందిన పి.టి. శ్రీనివాస్‌కు అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, ఆయనకు అండగా నిలిచేందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సహకారం అందించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన రూ.60,000 (అరవై వేల రూపాయలు) విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వ సాయం అందేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేసినందుకు పి.టి. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు, చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

చిన్న బండ్ల నుంచి పెద్ద మాల్స్ వరకు.. ఆహార భద్రత ప్రశ్నార్థకం!

నోరూరించే వీధి రుచులు.. మాల్స్‌లో మురిగిన పండ్లు.. ప్రజారోగ్యంతో చెలగాటం!

కలుషిత నీరు.. కల్తీ రంగులు.. పాడైన పండ్లు.. పదేపదే మరిగించిన నూనెలతో ఆరోగ్యానికి ముప్పు!

చిన్న వ్యాపారమైనా.. పెద్ద సంస్థ అయినా చట్టం ముందు సమానమే! నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, జైలు శిక్షలు తప్పవు!

నాగారం, నవంబర్ 06, 2026 (ప్రజాజ్యోతి): పట్టణాలు, నగరాల్లో వీధి ఆహార కేంద్రాల నుంచి పెద్ద షాపింగ్ మాల్స్, సూపర్‌మార్కెట్ల వరకు ఆహార పదార్థాల విక్రయాలు విస్తృతంగా జరుగుతున్నాయి. రోడ్ల పక్కన పానీపూరి, మిర్చి బజ్జీలు, పునుగులు, ఫ్రైడ్ రైస్, నూడుల్స్ వంటి పదార్థాలు ప్రజలను ఆకర్షిస్తుండగా, పెద్ద మాల్స్‌లో తాజా పండ్లు, కూరగాయలు, పండ్ల రసాలు, ఇతర ఆహార పదార్థాల విక్రయాలు పెరుగుతున్నాయి. అయితే కొన్ని ఆహార కేంద్రాల్లో పరిశుభ్రత లోపించడం, కలుషిత నీరు వినియోగించడం, నూనెను పదేపదే వేడి చేయడం, నిల్వ ఉన్న లేదా పాడైన పండ్లను విక్రయించడం వంటి చర్యలు ప్రజారోగ్యానికి ప్రమాదకరమని ప్రముఖ విద్యావేత్త, ఫార్మసీ నిపుణులు ప్రొఫెసర్ డా. విజయకుమార్ హెచ్చరించారు.

మురిగిన పండ్ల విక్రయాలపై నిఘా అవసరం!

పెద్ద మాల్స్, సూపర్‌మార్కెట్లు, పండ్ల విక్రయ కేంద్రాల్లో తాజా పండ్ల పేరుతో మురిగిన, కుళ్లిన, బూజు పట్టిన లేదా తినడానికి పనికిరాని పండ్లను విక్రయించడం వినియోగదారుల ఆరోగ్యానికి ప్రమాదకరం. బయటకు ఆకర్షణీయంగా కనిపించే కొన్ని పండ్ల లోపల పాడై ఉండవచ్చు. ముఖ్యంగా కోసి నిల్వ చేసిన పుచ్చకాయ, బొప్పాయి, అనాస, దానిమ్మ వంటి పండ్లను పరిశుభ్రత లేకుండా నిల్వ చేస్తే సూక్ష్మజీవులు పెరిగే అవకాశం ఉంటుంది. పాడైన పండ్లతో రసాలు తయారుచేయడం కూడా ప్రమాదకరం. కుళ్లిన భాగాన్ని తొలగించినంత మాత్రాన బూజు పట్టిన మెత్తని పండ్లు సురక్షితమవుతాయని భావించకూడదు. అందువల్ల విక్రేతలు నాణ్యతలేని పండ్లను వెంటనే తొలగించాలని, అధికారులు పండ్ల నిల్వ, విక్రయ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించాలని ఆయన సూచించారు.

పెద్ద మాల్స్‌కు ప్రత్యేక బాధ్యత!

ఆకర్షణీయమైన భవనాలు, శీతలీకరణ సౌకర్యాలు, ఖరీదైన ప్యాకేజింగ్ ఉన్నంత మాత్రాన ఆహారం నాణ్యమైనదని భావించకూడదు. పెద్ద మాల్స్, సూపర్‌మార్కెట్ల నిర్వాహకులు పండ్ల నాణ్యతను ప్రతిరోజూ పరిశీలించాలి. పాడైన పండ్లను మంచి పండ్లతో కలిపి విక్రయించకూడదు. నిల్వ గదుల్లో పరిశుభ్రత, అవసరమైన ఉష్ణోగ్రత, తేమ నియంత్రణ పాటించాలి. కోసిన పండ్లను సురక్షితంగా శీతలీకరించాలి. గడువు ముగిసిన ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను విక్రయించరాదు. పాడైన ఆహారాన్ని పారవేయకుండా తిరిగి విక్రయించే ప్రయత్నాలను అధికారులు అరికట్టాలి.

వీధి ఆహారంలోనూ అప్రమత్తత తప్పనిసరి!

చిన్న వీధి ఆహార కేంద్రాల్లో కలుషిత నీరు, అపరిశుభ్రమైన పాత్రలు, ఈగలు వాలిన ఆహారం, ఎక్కువసేపు నిల్వ చేసిన చట్నీలు, పాడైన కూరగాయల వినియోగం వల్ల టైఫాయిడ్, కలరా, విరేచనాలు, వాంతులు వంటి వ్యాధులు వ్యాపించవచ్చు. బజ్జీలు, పునుగుల తయారీలో నూనెను పదేపదే వేడి చేయడం వల్ల హానికరమైన రసాయన మార్పులు సంభవిస్తాయి. వాడిన వంటనూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ స్థాయి 25 శాతానికి మించరాదు. అలాగే ఆహారంలో అనుమతి లేని కృత్రిమ రంగులను ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధం. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

చిన్న బండి అయినా.. పెద్ద మాల్ అయినా చట్టం ఒక్కటే!

భారత ఆహార భద్రతా ప్రమాణాల చట్టం--2006 ప్రకారం ఆహార తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ, విక్రయాలు నిర్వహించే సంస్థలు సంబంధిత నిబంధనలను పాటించాల్సిందే. 2026 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన సవరించిన సాధారణ వ్యాపార పరిమితుల ప్రకారం వార్షిక వ్యాపార లావాదేవీలు రూ.1.50 కోట్ల వరకు ఉన్న సంస్థలకు నమోదు, రూ.1.50 కోట్లకు మించి రూ.50 కోట్ల వరకు రాష్ట్ర లైసెన్స్, ఆపై కేంద్ర లైసెన్స్ వర్తిస్తాయి. కొన్ని వ్యాపార వర్గాలకు ప్రత్యేక అర్హత నిబంధనలు కూడా వర్తించవచ్చు. వీధి వ్యాపారుల చట్టం--2014 కింద స్థానిక సంస్థల వద్ద నమోదైన అర్హులైన విక్రేతలకు ఆహార భద్రతా నమోదు విషయంలో వెసులుబాటు ఉన్నప్పటికీ ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి.

పాడైన ఆహార విక్రయాలకు చట్టపరమైన చర్యలు!

ఆహార భద్రతా చట్టంలోని సెక్షన్ 50 ప్రకారం వినియోగదారుడు కోరిన నాణ్యతకు భిన్నంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఆహారాన్ని విక్రయిస్తే సాధారణంగా రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ఈ సెక్షన్ కింద ప్రత్యేకంగా పేర్కొన్న చిన్న ఆహార వ్యాపారులకు జరిమానా గరిష్ఠ పరిమితి రూ.25 వేలు. సెక్షన్ 51 ప్రకారం నిర్దేశిత ప్రమాణాలకు తగ్గని ఆహారాన్ని విక్రయిస్తే రూ.5 లక్షల వరకు జరిమానా ఉంటుంది. సెక్షన్ 52 ప్రకారం తప్పుదారి పట్టించే లేబుళ్లతో ఆహారాన్ని విక్రయిస్తే రూ.3 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఆహారం తయారుచేస్తే సెక్షన్ 56 ప్రకారం రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

పాడైన పండ్లు లేదా ఇతర ఆహార పదార్థాలను విక్రయించినప్పుడు వాటి పరిస్థితి, పరీక్షల ఫలితాలు, నేర స్వభావాన్ని బట్టి సంబంధిత చట్ట నిబంధనలు వర్తిస్తాయి. అన్ని సందర్భాల్లో ఒకే రకమైన శిక్ష విధించరు.

అసురక్షిత ఆహారంతో ప్రాణనష్టం జరిగితే కఠిన శిక్షలు!

ఆహార భద్రతా చట్టంలోని సెక్షన్ 59 ప్రకారం ఆరోగ్యానికి హానికరమైన అసురక్షిత ఆహారాన్ని విక్రయించడం తీవ్రమైన నేరం. దాని వల్ల తీవ్రమైన గాయాలు కలిగితే ఆరేళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. అసురక్షిత ఆహారం కారణంగా మరణం సంభవించినట్లు న్యాయపరంగా నిర్ధారణ అయితే కనీసం ఏడేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్షతోపాటు కనీసం రూ.10 లక్షల జరిమానా



విధించే అవకాశం ఉంది. తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సిన సంస్థలు లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే సెక్షన్ 63 ప్రకారం రూ.10 లక్షల వరకు జరిమానా విధించవచ్చు.

అధికారుల తనిఖీలు మరింత పెరగాలి!

నాగారం, రాంపల్లి, దమ్మాయిగూడ, కీసరతోపాటు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చిన్న వీధి ఆహార కేంద్రాలు, పండ్ల దుకాణాలు, సూపర్‌మార్కెట్లు, పెద్ద మాల్స్‌పై ఆహార భద్రతా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. పండ్ల నాణ్యత, నిల్వ పరిస్థితులు, గడువు ముగిసిన పదార్థాల విక్రయాలు, వంటనూనె నాణ్యత, నీటి స్వచ్ఛతపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. అవసరమైన నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. చిన్న వ్యాపారులను మాత్రమే లక్ష్యంగా చేసుకోకుండా పెద్ద సంస్థలనూ సమానంగా పర్యవేక్షించాలి.

ప్రజలూ ప్రశ్నించాలి.. ఫిర్యాదు చేయాలి!

వినియోగదారులు పండ్లు కొనుగోలు చేసే ముందు వాటి తాజాదనం, రంగు, వాసన, బూజు, కుళ్లిన భాగాలను పరిశీలించాలి. కోసిన పండ్లను కొనుగోలు చేసేటప్పుడు నిల్వ పరిస్థితులను గమనించాలి. పాడైన పండ్లు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రమైన ఆహార విక్రయాలు కనిపిస్తే బిల్లు, ఫొటోలు వంటి ఆధారాలతో సంబంధిత ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఆహార భద్రతా సంస్థ అందుబాటులో ఉంచిన ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ సేవ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చు.

ప్రజల ఆరోగ్యంతో రాజీపడొద్దు!

చిన్న వీధి వ్యాపారుల ఉపాధిని కాపాడుతూనే పెద్ద సంస్థలతో సహా అన్ని ఆహార విక్రయ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని డా. విజయకుమార్ కోరారు. లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడం సమర్థనీయం కాదన్నారు. ఆహార నాణ్యతపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "చిన్న బండి అయినా.. పెద్ద మాల్ అయినా.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే హక్కు ఎవరికీ లేదు. ఆహార భద్రత ప్రతి పౌరుడి హక్కు.. నాణ్యత, పరిశుభ్రత ప్రతి వ్యాపారి బాధ్యత. రుచి క్షణకాలం.. ఆరోగ్యం జీవితకాలం!" అని ఆయన స్పష్టం చేశారు.

కౌకూర్ 189వ డివిజన్‌లో పెండింగ్ సీసీ రోడ్ల పనులపై అధికారుల పరిశీలన

అల్వాల్ నవంబర్ 6 (ప్రజా జ్యోతి) మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కౌకూర్ 189వ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులపై శుక్రవారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులతో పాటు కట్ట మైసమ్మ దేవాలయం సమీపంలోని చెరువు లైన్ రోడ్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్, డీఈ పద్మలత, వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశంకర్ పాల్గొని రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. ఈ పరిశీలనలో 189వ డివిజన్ కౌకూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, తిరుపతి రావు, మల్లేష్ యాదవ్, వీణ సతీష్, నరేష్, సురేష్ పాల్గొన్నారు. అలాగే కాలనీ వాసులు రాజిరెడ్డి, భాస్కర్, హేమ, రాజు యాదవ్, రఫీ తదితరులు పాల్గొని తమ కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనుల సమస్యలను పరిష్కరించి, స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎదురవుతున్న మౌలిక వసతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ఈ పరిశీలన కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.



తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లకు చివరి అవకాశం

తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): తలకొండపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ లో చేరాలనుకునే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది.ఈ నెల11నుండి 14 వరకు అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల యాజమాన్యం తెలిపారు.ఇప్పటి వరకు ఇంటర్ లో జాయిన్ కాని విద్యార్థులు,వివిధ కారణాల వల్ల చదువుకు దూరమైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వ కళాశాలలో తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య,అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన,మంచి వసతులు ఉంటాయని తెలిపారు.పేద,మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.కావున తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల తలకొండపల్లిలో చేర్పించాలని,ఈ చివరి అవకాశాన్ని చేజార్చుకోవద్దని కళాశాల నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.అడ్మిషన్ల వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కొడంగల్‌లో కిసాన్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు

ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన

మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారి అనురాధ

మొయినాబాద్: నవంబర్ 06 (ప్రజా జ్యోతి) రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు సోమవారం కొడంగల్‌లో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. ఈ కిసాన్ మేళాలో వ్యవసాయ అభివృద్ధి, పంటల సాగులో నూతన విధానాలు, ఆధునిక యంత్రాల వినియోగం, దిగుబడుల పెంపు తదితర అంశాలపై రైతులకు నిపుణులు అవగాహన కల్పించనున్నారు. మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు అందుబాటులో ఉన్న ఆధునిక పద్ధతులు, రైతుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ఈ కార్యక్రమంలో వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళా ద్వారా రైతులకు వ్యవసాయంపై మరింత అవగాహన పెరగడంతో పాటు సాగులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మొయినాబాద్ మండలం నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నట్లు ఏఓ అనురాధ వెల్లడించారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 6 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లు మరింత అంకితభావంతో పనిచేస్తూ విద్య, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, భూసేకరణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ పథకాల పురోగతిని సమీక్షించారు. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు: ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సీఎస్ సూచించారు. రాష్ట్రంలోని 565 మండలాల్లో ఆవాసాల వారీగా నీటి ఎద్దడిని అంచనా వేయాలని, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధి పనులకు ప్రత్యేక ప్రాధాన్యం: వీబీ-జీ రామ్ జీ పథకం కింద ప్రస్తుతం రోజుకు 5.38 లక్షల పనిదినాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 2027 మార్చి నెలాఖరుకు 11 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతి ఆవాసంలో ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. పశుగ్రాసం పెంపకం, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : చేయూత పథకం కింద పెండింగ్‌లో ఉన్న 38 వేల పింఛన్ దరఖాస్తుల పరిశీలనను నవంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు బస్తా సిమెంట్ రూ.230కు అందుబాటులో ఉండగా, 'మన ఇసుక వాహనం' ద్వారా ఇసుక సరఫరా చేయాలని తెలిపారు. అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ జిల్లా నుంచి అదనపు కలెక్టర్ వెంకటాచారి, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, మిషన్ భగీరథ అధికారులు రవి, ముక్రం బాబా,







అదనపు డీఆర్‌డీఏ సత్తయ్య, జెడ్పీ సీఈఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవకు ప్రత్యేక శిబిరాలు ఎంతో ఉపయోగకరం

దివ్యాంగుల గుర్తింపు, కౌన్సెలింగ్ శిబిరంలో ముఖ్య అతిథిగా ముద్దం నర్సింహ యాదవ్



బోయిన్ పల్లి, నవంబర్ 6.(ప్రజా జ్యోతి): హస్మత్‌పేట్ మోడల్ మార్కెట్‌లో జి ఎల్ ఆర్ ఏ ఇండియా (కూకట్‌పల్లి) ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల గుర్తింపు, కౌన్సెలింగ్ శిబిరంలో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ఇటువంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు, తగిన కౌన్సెలింగ్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.దివ్యాంగులకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జి ఎల్ ఆర్ ఏ ఇండియా ప్రతినిధులు, శిబిర నిర్వాహకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ హాకీ గ్రౌండ్‌లో దీపావళి టపాసుల సందడి

దోబీఘాట్ వద్ద కొలువుదీరిన క్రాకర్స్ బజార్.. ఆకట్టుకుంటున్న బాణసంచా దుకాణాలు







బోయిన్ పల్లి, నవంబర్ 6.(ప్రజా జ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని హాకీ గ్రౌండ్, దోబీఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు సందర్శకులతో కళకళలాడుతున్నాయి. వివిధ రకాల రంగురంగుల టపాసులు, ఆకర్షణీయమైన గిఫ్ట్ బాక్సులు, పలు రకాల బాణసంచా ఉత్పత్తులతో క్రాకర్స్ బజార్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.అధికారుల ఆదేశాలు, సూచనల మేరకు నిర్వాహకులు పటాకుల విక్రయాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. దుకాణాలను వరుస క్రమంలో ఏర్పాటు చేయడంతో పాటు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా విశాలమైన ప్రవేశ మార్గాలు, విద్యుత్ దీపాలతో వెలుగులు, ఇతర సౌకర్యాలు కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తల్లో భాగంగా అగ్నిమాపక పరికరాలు, నో స్మోకింగ్ జోన్ సూచికలు ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది.నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఈ క్రాకర్స్ బజార్‌కు చేరుకుని తమకు నచ్చిన బాణసంచాను కొనుగోలు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, చిన్నారులతో కలిసి వచ్చి దీపావళి పండుగకు అవసరమైన టపాసులను కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ప్రాంతంలో పండుగ సందడి నెలకొంది.దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో పాటు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ జరుపుకోవాలని, టపాసులు కాల్చే సమయంలో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు. మొత్తానికి కంటోన్మెంట్ హాకీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రాకర్స్ బజార్ దీపావళి పండుగ శోభను మరింత పెంచుతోంది.

వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరె

మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్.. మరో నిందితుడి కోసం గాలింపు

సంగారెడ్డి జిల్లాలో మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించిన సంగారెడ్డి పోలీసులు

ఎయిర్ పిస్టల్ (నకిలీ తుపాకీ), 2-కత్తులు, నేరాలకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, ఇతర వస్తువులు స్వాధీనం

నిందితులపై మహారాష్ట్రలో గతంలోనూ పలు దొంగతనాలు, దోపిడీ కేసులు నమోదు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి : జిల్లాలో నమోదైన వరుస దారి దోపిడీ కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఆదేశాల మేరకు సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టి, జిల్లాలో నమోదైన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 65 పై జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించడం జరిగింది. ఈ కేసులకు సంబంధించి మహారాష్ట్రకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ముగ్గురు నేరస్తులు నేరం చేయడానికై మహారాష్ట్ర నుంచి యమహా బ్లూ కలర్ నెంబర్ ప్లేట్ లేని బైక్ పై బయలుదేరి నల్లని మాస్క్, స్వెట్టర్ లు, 2-కత్తులు బ్యాగ్ లో పెట్టుకొని, మరో వ్యక్తి ఎయిర్ పిస్టల్ ను కనబడకుండా దాచి పెట్టుకొని, తెలంగాణ వైపు వస్తుండగా, చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్గి చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని యమహా బ్లూ కలర్ ఆర్ 15 బైక్ పై అనుమానాస్పదంగా కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, సంగారెడ్డి జిల్లాలో జరిగిన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని హుమ్నాబాద్‌లో జరిగిన మరో దారి దోపిడీ కేసులో తమ ప్రమేయాన్ని వెల్లడించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. చెన్నూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదలు, కార్మికులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతి అర్హుడికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే మా బాధ్యత. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా నిరంతర లక్ష్యమని అన్నారు.

మరో భర్త హతం

ప్రియుడి మోజులో పడి భర్తను హతమార్చిన భార్య

జయశంకర్ భూపాలపల్లి : భార్య చేతిలో హత్యకు గురయిన జాబితాలో మరో భర్త చేరాడు. గొల్లబుద్ధారం గ్రామంలో సంతోష్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని, భార్య పావనిభర్త అజ్మీర చందు (30)ను హతమార్చింది. ప్రియుడితో కలిసి హత్య చేసి, ఎడ్లబండిపై మృతదేహాన్ని చికెన్‌పల్లి సమీపంలో నిందితురాలు పడేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న ప్రియుడు సంతోష్, భార్య పావని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సివిల్ సప్లై అధికారుల తనిఖీలు..

ధరల పట్టిక ప్రదర్శించాలని ఆదేశాలు

హైదరాబాద్ : సివిల్ సప్లై అధికారులు శుక్రవారం నాడు మెహిదీపట్నం లో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అధికారిణి బుష్రా సుల్తానా నేపధ్యంలో ఈ తనిఖీలు జరిగాయి. నిత్యావసర వస్తువుల అమ్మకాలను అధికారుల బృందం పరిశీలించింది. పలు దుకాణాల్లోని సరకులకు వున్న రేట్ లేబుళ్లను తొలగించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. ఖచ్చితంగా ప్రభుత్వ ధరలకే అమ్మకాలు చేయాలని అన్నారు.

12వ రోజుకు చేరిన రైతుల రిలే దీక్షలు





యాలాల్ నంబర్ 6 ప్రజా జ్యోతి తహసీల్దార్ గాయత్రి హామీతో దీక్షల విరమణ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది -- తహసీల్దార్ గాయత్రి యాలాల మండల పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా రైతుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన యాలాల తహసీల్దార్ గాయత్రి రైతులతో మాట్లాడారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,రైతుల సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న తహసీల్దార్ హామీ మేరకు రైతులు తమ రిలే నిరాహార దీక్షలను విరమించారు.అయితే రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రైతులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప,ఎతీజూం జిల్లా నాయకులు మహేందర్,వడ్డే బాలరాజ్,వడ్డే అంజిలమ్మ,వడ్డే వెంకటయ్య,వడ్డే మల్లమ్మ,వడ్డే సత్యమ్మ, వడ్డే పెద్ద వెంకటయ్య, వడ్డే రాములు తదితరులు పాల్గొన్నారు

ఎల్‌నినోను ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రసాదించాలి

పోచమ్మ తల్లి జాతరలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 06 (ప్రజా జ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువు పరిస్థితులను అధిగమించే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోచమ్మ తల్లి ప్రసాదించాలని తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రార్థించారు. వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామంలో నిర్వహిస్తున్న పోచమ్మ తల్లి మూడవ వార్షిక జాతర ఉత్సవాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలతో పాటు వికారాబాద్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే విపత్కర పరిస్థితులను ఎదుర్కొని, కరువు నుంచి రాష్ట్రం గట్టెక్కేలా అమ్మవారు కరుణించాలని కోరుకున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని, గ్రామంలో ఐక్యత, శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. జాతరను ఘనంగా నిర్వహిస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులను అభినందించారు. అందరికీ జాతర శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన ఏఆర్ కానిస్టేబుల్

భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలం పట్టణంలో ఒక ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యను హతమార్చి గోదావరి లో పడేసాడు. కానిస్టేబుల్ నరేందర్ ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యనే హత్య చేసాడు. నరేందర్ కు భవాని సోషల్ మీడియా ద్వారా పరిచయమైయింది. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఎనిమిది నెలల క్రితం పాప జన్మించగా ఆ తర్వాత చిన్నారి చనిపోయింది. తరువాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో నరేందర్ భార్యను హతమార్చి మృతదేహాన్ని గోదావరిలో పడేసాడు. విషయం తెలిసిన పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో భవాని మృతదేహం కోసం గాలిస్తున్నారు. భార్యను హత్య చేయడానికి దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ కష్టాలు

కరీంనగర్ : పొద్దంతా బొగ్గు గనుల్లో కష్టపడి.. చెమటోడ్చి.. సింగరేణి సంస్థ అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన కార్మికులు.. ఇప్పుడు రిటైర్మెంట్ తర్వాత తమ కనీస అవసరాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధాప్యంలో కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన నెలవారీ పెన్షన్.. వారి పాలిట పెను సమస్యగా మారుతోంది. ప్రతి నెల ఒకటో తేదీన ఖాతాల్లో జమ కావాల్సిన పెన్షన్.. గురువారం వరకు కూడా పలువురు రిటైర్డ్ కార్మికులకు

పరిగి ఆర్టీసీ డిపోలో ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు



పరిగి, నవంబర్ 06 (ప్రజాజ్యోతి): పరిగి ఆర్టీసీ బస్ డిపోలో గ్యార్మీ షరీఫ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు పెంటన్న, పరిగి మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, కౌన్సిలర్లు మీర్ తాహేర్ అలీ, వారాల రవీందర్, మీదిగడ్డ శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మునీర్, ఆర్టీసీ ఉద్యోగులు ఫహీమ్, బలాల నయీం తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పరిగి పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పరిగి పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. అలాగే సమాజంలో మతసామరస్యం, సోదరభావం, ఐకమత్యం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గ్యార్మీ షరీఫ్ వేడుకలను నిర్వహించారు.

ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జీవన్గి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువకులు



బషీరాబాద్, నవంబర్ 6, ప్రజా జ్యోతి:వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు మెంబర్లు, యువకులు తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డిని శ్రు క్రవారం హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా గ్రామ పెద్దలు కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొటపు మానిక్ రెడ్డి నర్సిరెడ్డి కేశవరెడ్డి వార్డ్ వార్డ్ మెంబర్స్ సంగారెడ్డి రాజు నర్సింలు లక్ష్మణ్ అనంతప్ప సోసైటి డైరెక్టర్ నర్సింలు జగదీష్ మైపాల్ నర్సింలు నాగయ్య వెంకటప్ప కాజమియా వెంకటప్ప ఎలిశం మహదేవప్ప మహేష్ వీరేశం దేవప్ప నజీర్ నసీర్ గంగాప్ప జయ్ ప్రసాద్ రాములు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిభిరము

శ్రీ సాయి దంత వైద్య కళాశాల




బషీరాబాద్ నవంబర్ 6 ప్రజా జ్యోతి వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో శ్రు క్రవారం తెలంగాణ మోడల్ స్కూల్ బషీరాబాద్ లో ఉచిత దంతా క్యాంప్ వికారాబాద్ వారు నిర్వహించబడినది , కళాశాల ప్రిన్సిపల్ అనిలా మేడం తో పాటు డాక్టర్ దీక్షిత్ పాల్, డాక్టర్ వసంత్, డాక్టర్ శిరీష, డాక్టర్ సంజన,డాక్టర్ అపూర్వ, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ శివాత్మిక,పిఆర్ఓ రవీందర్ గౌడ్, డ్రైవర్ సుదర్శన్ అశోక్ ,అటెండర్, అలవేలు సిస్టర్ కళాశాల విద్యార్థులు అధ్యాపకు బృందం ఉచిత క్యాం సేవలువినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌కు షాక్..

బార్వాద్‌లో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

బార్వాద్ ఉపసర్పంచ్ శివకుమార్ సహా పలువురు యువకులు గులాబీ గూటికి




వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 06(ప్రజా జ్యోతి): కాంగ్రెస్ పార్టీకి చెందిన బార్వాద్ గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్‌తో పాటు పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కోట్‌పల్లి మండలం బార్వాద్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపసర్పంచ్ శివకుమార్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పరమేష్, జి. మహేష్, టి. మహేష్, పి. ఆంజనేయులు, బి. రాకేష్, శ్రీశైలం, శ్రీనివాస్, మోహన్, శ్రీకాంత్‌తో పాటు పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని భావించి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామన్నారు. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలోకి ఇతర పార్టీల నాయకులు చేరుతారని, తెలంగాణలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి పార్టీ చేరికలే నిదర్శనమన్నారు. కేసీఆర్‌ను కోల్పోయామని తల్లులు కన్నీరు పెట్టుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే మిగులుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి పోరాటం కొనసాగిస్తుందని ఆయన అన్నారు.

జేబీఐటీ విద్యార్థిని వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

ప్రొఫెసర్ ఉపేందర్ వేధింపులే కారణమని ఆరోపణలు

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం

ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్



మొయినాబాద్: నవంబర్ 06 (ప్రజా జ్యోతి) జేబీఐటీ కళాశాల విద్యార్థిని వైష్ణవి మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జేబీఐటీ కళాశాల ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థిని మృతికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బేగరి అరుణ్ కుమార్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. కళాశాలలో ప్రొఫెసర్ ఉపేందర్ వేధింపుల కారణంగానే విద్యార్థిని వైష్ణవి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యలకు యాజమాన్యమే బాధ్యత

కళాశాలలో విద్యార్థులు ప్రొఫెసర్ల నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు ఆరోపించారు. గతంలో కూడా కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జేబీఐటీ కళాశాలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ భరోసా

విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదురైనా ఆత్మహత్య వంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, ధైర్యంగా తమ సమస్యలను తెలియజేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సూచించారు. విద్యార్థులకు అండగా ఉంటూ న్యాయం జరిగే వరకు పోరాడుతామని భరోసా ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల ఉపాధ్యక్షుడు విష్ణు, చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, డివిజన్ నాయకులు సాయి, కార్తీక్, కిరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా చుక్కాపూర్ లో సదర్ ఉత్సవాలు

సదర్ ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.1 కోటి చొప్పున రూ.33 కోట్లు కేటాయించాలి

ఐక్యతకు నిదర్శనం చుక్కాపూర్ యాదవ సదర్ సంబరాలు

ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్,మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి







తలకొండపల్లి,నవంబర్ 06 (ప్రజాజ్యోతి): భారతదేశవ్యాప్తంగా జరుపుకునే పండుగలలో సదర్ ఉత్సవ పండుగ అత్యంత పవిత్రతకు నాంది పలుకుతుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్,మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలతో పాటు ఏ గ్రామంలో అయినా యాదవులు,కురుమలు లేని గ్రామాలు లేవని మాజీ ఎమ్మెల్యే గుర్తు చేశారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో కడారి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు శుక్రవారం కట్టుగాడికి కొంచెం ఎక్కువ ఘనంగా జరిగాయి.సదర్ ఉత్సవాల సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణం నెలకొంది.ఉదయం నుండే గ్రామస్తులు,యువకులు ఎంతో ఉత్సాహంతో ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొన్నారు.ఈ సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరైన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్,మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారిలు మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని,యాదవ సోదరుల ఐక్యతను చాటే పండుగ అని అన్నారు.సదర్ అంటే కేవలం పండుగ మాత్రమే కాదని,యాదవుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు.గ్రామంలో ఐక్యతతో ఇలాంటి ఉత్సవాలు జరుపుకోవడం అభినందనీయమని తెలిపారు. యాదవులు తమ వృత్తిని, సంస్కృతిని కాపాడుకుంటూనే విద్య,ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు.సదర్ ఉత్సవాలకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు రూ.1 కోటి చొప్పున రూ.33 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.అప్పుడే ప్రతి గ్రామంలో సదర్ ఉత్సవాలు మరింత ఘనంగా జరుగుతాయని అన్నారు.యువత సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని,గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామంలో ఐక్యత ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని,చుక్కాపూర్ గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.అనంతరం సదర్ ఉత్సవాల నిర్వాహకులను,గ్రామ యువకులను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.డీజే పాటలతో,సంప్రదాయ నృత్యాలతో గ్రామ వీధులన్నీ మారుమోగాయి.యాదవ సోదరులు తమ సంప్రదాయ దుస్తులతో,ఎర్రటి పగిడీలు ధరించి,పూలతో అలంకరించిన దున్నపోతులతో ఊరేగింపుగా బయలుదేరారు. ఊరేగింపులో యువకులు చేసిన డప్పు చప్పుళ్లు,కేరింతలు అందరినీ ఆకట్టుకున్నాయి.గ్రామ పెద్దలు,మహిళలు, చిన్నారులు సైతం ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు.ఈ ఉత్సవాలలో తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఉత్సవాన్ని తిలకించారు.దీంతో చుక్కాపూర్ గ్రామం జాతరను తలపించింది.రాత్రి వరకు సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాకం వీరేశలింగం,ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము,మాజీ ఏఎంసీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య,యాదవ కమిటీ అధ్యక్షుడు కడారి శేఖర్ యాదవ్,పాండు రంగారెడ్డి,కుమార్ యాదవ్,బైకని శ్రీశైలం,యాదయ్య,కాగుల శ్రీశైలం,కాగుల శేఖర్,కాగుల కుమార్,కడారి రాజు,కాగుల ప్రకాష్,నీలకంఠం పాండు, షానమోని పాండు,తిరుమని రవి,రామకృష్ణ యాదవ్,నీలకంఠ పాండు,పాండు ప్రసాద్,రవి గౌడ్,పద్మ అనిల్,రవి రాథోడ్,ప్రశాంత్,దుడ్డు కృష్ణ,పుట్ట లక్ష్మయ్య,దుగ్గపుర కుమార్, దుగ్గపురం బాలకృష్ణ, పర్వతాలు యాదవ్,ఎట్టి రాజు,ఈసారి బాలకృష్ణ, హరికాంత్, వెంకటేష్ నాయక్,తాగూర్ ,కళ్యాణ్, మహేష్, గ్రామస్తులు,యాదవ సోదరులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనిపించని అధికార పార్టీ ప్రభావం

వరంగల్ : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గాల ను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందు తున్నాయి. ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అఖా స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘా లు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి జరుపుకోండి

కాంగ్రెస్ నాయకులకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ సూచన

హైదరాబాద్ ఈ నెల 8వ తేదీన దీపావళి రోజున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అంత ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ చేసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పేరుతో గతంలో ఎన్నడూ లేని విదంగా పేదలకు కొత్త ఇల్లు ఇవ్వడం జరిగింది ఇది వారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చే సందర్భం .. ఈ ఆనందాన్ని వారితో పంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల కల నెరిన సమయంలో వారితో దీపావళి జరుపుకోవాలని కోరుతున్నాము. గ్రామాల్లో రెండు దఫాలలో ఇల్లు ఇవ్వడం జరిగింది. హైదరాబాద్ లక్ష ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. కొన్ని ఇళ్లలో గృహ ప్రవేశాలు.కూడా జరిగాయి..ఇది నభూతో న భవిష్యత్ ఇలాంటి పండుగను మనం ఘనంగా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకోవాలని.విజ్ఞప్తి చేస్తున్నానని అయన అన్నారు.

వరంగల్‌లో భారీగా కల్తీ కారం, పసుపు పొడి పట్టివేత.. 2,250 కిలోలు స్వాధీనం

వరంగల్ : నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీపై అధికారులు కొరడా ఝుళిపించారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీగా కల్తీ కారం, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కరీమాబాద్‌కు చెందిన ఆకుతోట గోపిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 2,250 కిలోల కల్తీ కారం, పసుపు పొడిని అధికారులు పట్టుకోగా, వీటి విలువ సుమారు రూ.5.92 లక్షలుగా అంచనా వేశారు. ఎలాంటి లైసెన్స్, లేబుల్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పొడులను ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై అధికారులు చర్యలు చేపట్టారు.

ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్

కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

జనగామ : తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ వుంటుందని కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఉద్యమకారుడు, సొంత పార్టీ నాయకుడు ఆత్మహత్య చేసుకుని మరణిస్తే కనీసం పట్టించుకోని బీఆర్ఎస్, అలాంటిది ఉద్యమ పార్టీ అని చెప్పుకోవడం విడ్డూరమని అన్నారు. బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల లక్ష్మణ్ గౌడ్ . బీఆర్ఎస్ పార్టీ కోసం అప్పు చేసి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అప్పులు తీర్చలేక, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఎలాంటి సహాయం అందకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు, ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అయన అందజేసారు. ఎన్నికల్లో లక్ష్మణ్ గౌడ్‌ను వాడుకుని లబ్ధిపోంది, నేడు కనీసం ఆయన కుటుంబాన్ని కూడా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించలేదని అయన విమర్శించారు.

అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం

నల్గొండ : నల్గొండ జిల్లాకు చెందిన యువతి అమెరికా లో మిస్సింగ్ అయింది. కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామం నుంచి యాదగిరిరెడ్డి?రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లింది. ఓ కళాశాలలో చదువుతూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమా చారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదయింది. పోలీసులు గాలింపులు చేసట్టారు. ఒక్కగానొక్క కుమార్తె అమెరికాలో అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులు సంయమనంతో ఉండాలి

ఉయ్యూరు టౌన్ సీఐ ఎఎ రామారావు

ఉయ్యూరు టౌన్ ఎన్నికల ఫలితాల అనంతరం పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యర్థుల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చడం, వారిని గేలి చేయడం వంటి ఘటనలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి చర్యల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తామని టౌన్ సీఐ ఎఎ రామారావు హెచ్చరించారు "ప్రజలు మీపై నమ్మకం పెట్టుకుని గెలిపించారు. ఆ నమ్మకానికి తగిన హుందాతనంతో ప్రవర్తించాలని, ప్రత్యర్థుల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చడం, గేలి చేయడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం వంటి చిల్లర పనులు మానుకోవాలని హితవు పలికారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇతరులను రెచ్చగొట్టి పట్టణ ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు

మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !

కరీంనగర్ : రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయలో పార్టీ కేవలం జాతీయ స్థాయి పార్టీగానే కాకుండా, అధికార బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాలు సాధించడంతో పాటు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఊహించని విధంగా ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకుని సంచలనం సృష్టించింది. సంజయ్ అనుసరించిన దూకుడు రాజకీయ శైలి, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేసే తీరు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాయి.అయితే, ఆయన దూకుడుతో పార్టీలో అంతర్గతంగా కొంత అసంతృప్తి చెలరేగడం, కొందరు సీనియర్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఆయనను ఆ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతూ వచ్చాయి.ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, రాష్ట్రంలో పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలన్నా, కేడర్‌లో ఉత్సాహం రావాలన్నా బండి సంజయ్ లాంటి దూకుడుగల నాయకుడే కచ్చితంగా అవసరమని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న సునీల్ బన్సాల్ తదితర పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అధ్యక్ష మార్పుపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే, ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని మళ్లీ బండి సంజయ్‌కే కట్టబెట్టాలనే ప్రతిపాదనపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఒకవేళ బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పగ్గాలు దక్కితే తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యకర్తలతో నేరుగా కనెక్ట్ అయ్యే నాయకుడిగా పేరున్న సంజయ్ రాకతో పార్టీ కేడర్‌లో మళ్ళీ కొత్త